DD9 వార్త
తెలుగు దినపత్రిక

DD9 వార్త & పత్రికకు
CHANNEL
ఈ క్రింద సూచించిన ప్రాంతాలకు
విలేకరులు కావలెను
కూకట్ పల్లి | పఠాన్ చెరు | ఎల్ బి నగర్ | మెదక్ | చార్మినార్ | అల్వాల్ | ఖైరతాబాద్ | మోండా | బంజారాహిల్స్ | శ్రీనగర్ కాలని | మియాపూర్ | కంటోన్మెంట్ | గజ్వేల్ | హిమాయత్ నగర్ | గోల్‌నాక | శేరిలింగంపల్లి | నార్సింగ్ | వివేక్ నగర్ | కుత్బుల్లాపూర్ | పేట్ బషీరాబాద్ | నాచారం | సికింద్రాబాద్
Call: 7013974008
DD9 VARTHA

సంపుటి : 01 సంచిక : 22 | బుధవారం, ఆగస్టు 27, 2025, | పేజీలు - 12 | వెల : 3/-

### కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే..

# రాజకీయ సన్యాసం

**ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్**

**ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది**

**పిసిసి చీఫ్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్**

**కరీంనగర్,ఆగస్ట్26:** కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం మిగతా 2లో...

వినాయక చవితి శుభాకాంక్షలు



పాఠకులకు. ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు యాజమాన్యం తరపున వినాయక చవితి శుభాకాంక్షలు మీకు మీ కుటుంబాలకు ఆ వినాయకుని ఆశీస్సులు ఉండాలని మనసారా కోరుకుంటూ...

**గమనిక :-**

పండుగ సంధర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున రేపు ( గురువారం ) పత్రిక వేలువడదు. తిరిగి పునర్ధర్శనం శుక్రవారం

- ఎడిటర్ -

### ఎలక్ట్రిక్ వాహన రంగంలోకి

# మారుతి

**తొలి ఇవి- విటారా**

**ఉత్పత్తి ప్రారంభం**

**వంద దేశాలకు ఎగుమతి**

**లక్ష్యంగా ఉత్పత్తులు**

**గుజరాత్ హన్సల్‌పూర్**

**ప్లాంట్‌లో ప్రారంభించిన మోడీ**



2లో



# గవర్నర్లకు విచక్షణాధికారం

**ఆర్థిక బిల్లులును కూడా అడ్డుకోవచ్చు**

**ఇది సమస్యాత్మ అంశమని సుప్రీం అభిప్రాయం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మిగతా2లో...

### స్థానిక ఎన్నికలపై


# కసరత్తు




**ఓటర్ల జాబితా విడుదలకు ఇసి నోటిఫికేషన్**

**28లోపు ముసాయిదా జాబితా ప్రకటన**

**హైదరాబాద్, ఆగస్టు 26:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు మిగతా2లో...



# జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌కు చుక్కెదురు

**ఛార్జిషీటులో పేరును తొలగించాలన్న పిటిషన్ కొట్టివేత**

**హైదరాబాద్, ఆగస్టు 26:** జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ నుంచి తమ సంస్థ పేరును తొలగించాలంటూ వాన్‌పిక్ దాఖలు చేసిన మిగతా2లో...

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం




**హైదరాబాద్, ఆగస్టు 26:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం పశ్చిమ మిగతా2లో...


### నేడు ఖైరతాబాద్ వినాయకుడికి

# ప్రాణప్రతిష్ట

**● మట్టితో పాటు సంప్రదాయ రంగులు ● నేడు పూజలతో అంకురార్పణ**



**హైదరాబాద్, ఆగస్టు 26:** వినాయకచవితి అనగానే ఖైరతాబాద్ గణేషుడే గుర్తుకు వస్తాడు. ఈసారి కూడా ఖైరతాబాద్ వినాయకుడు సర్వాంగ సుందరంగా ముస్తాబ య్యాడు. భారీ గణపతిని మట్టితో చేశారు. గణేష్ విగ్రహం తయారీ పూర్తి అయింది. ఏటా హైదరాబాద్‌లో ఎటు చూసినా వినాయకచవితి సందడే కనిపించేది. వినాయక చవితి అంటేనే బోలెడంత జోష్ ఉండేది. చిన్నా, పెద్దా అనే తేడా లేదు. గల్లీ గల్లీలోనూ ఎక్కడ చూసినా గణపయ్య పేరే వినిపించేది. హైదరాబాద్‌లో వినాయక చవితి పండగ ప్రత్యేకతే వేరు. విగ్రహం ప్రతిష్టా పన దగ్గర నుంచీ నిమజ్జనం వరకూ అంతా భక్తి భావంతో ఉప్పొంగిపోతారు. ఘనంగా జరుపుకునేందుకు ఆరాటపడతారు. తమకు తోచిన విధంగా విగ్రాహాలు మిగతా2లో...




### దేశానికే ఆదర్శంగా తెలంగాణ

# రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు**

**త్వరలో రూ.33 కోట్ల చేనేత రుణాల మాఫీ**

**ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ ఒక్కో హామీ అమలు**

**సిరిసిల్ల కే కన్వెన్షన్ హాల్ లో నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తుమ్మల**

**హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ**

**రాజన్న సిరిసిల్ల,//** దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ...

10 సంవత్సరాల కాలంగా ఉన్న బకాయిలను ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల రుణ మాఫీ వర్తింప చేస్తున్నామని, 33 కోట్ల చేనేత రుణాలను రాబోయే క్యాబినెట్ సమావేశంలో మాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2500 మెట్రిక్ టన్నుల నూలు 100 సోసైటీలకు సరఫరా చేయడం జరిగిందని వెల్లడించారు. నేతన్న చేయూత, నేతన్న పొదుపు, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలను జమ చేస్తున్నామని అన్నారు. ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్నా పేద ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్కో హామీ అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత ప్రయాణానికి 6680 కోట్ల రూపాయలు చెల్లించిందని, మహిళలకు 200 కోట్ల జిరో టికెట్లు జారీ చేశామని, మనల్ని చూసి పక్క రాష్ట్రాలు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయని అన్నారు.

సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని, పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలతో దేశంలో 2 కోట్ల 80 లక్షల ట్రిప్ టన్నుల ధాన్యం పండిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి తెలిపారు.దేశానికే తెలంగాణ రాష్ట్రం మోడల్ గా నిలిచిందని అన్నారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, మహిళలకు 500 రూపాయల మిగతా2లో...

# గవర్నర్లకు విచక్షణాధికారం

(మొదటి పేజీ తరువాయి)

మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం కొంత సమస్యాత్మకమేనని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం ధర్మాసనం అభిప్రాయంతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బిల్లులను 3 నెలల గడువులోగా గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించాలంటూ గతంలో జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దుమారం రేగింది. దీంతో రాష్ట్రపతి దౌపది ముర్ము 12 సందేహాలను లేవనెత్తారు. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని అపెక్స్ కోర్టుకు 12 ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీజెఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహా, ఏఎస్ చందూర్‌కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మసనం మంగళవారం నాడు విచారణ జరుపుతోంది.

# జగన్ అక్రమాస్తుల కేసులో వాన్‌పిక్‌కు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గతంలో వాన్‌పిక్ పేరును సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. ప్రస్తుతం ఈ కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. అయితే, 2022 జులైలో వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్ట్ పిటిషన్‌ను అనుమతించారని వాదించింది. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం మరోసారి పిటిషన్‌ను విచారించాలని హైకోర్టును ఆదేశించింది. మరోసారి వాన్‌పిక్ ప్రాజెక్టుపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను కొట్టివేసింది.

# బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

(మొదటి పేజీ తరువాయి)

వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని చత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని వివరించింది. తెలంగాణతో పాటు- ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురు వనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురువనున్నాయి. కాకినాడ, పోలవరం, ఏలూరులో భారీ వర్షాలు, ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ట

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్టించేందుకు ఆసక్తి చూపిస్తారు. రెండు, మూడు వారాల క్రితం నుంచే వినాయకచవితి ఉత్సవాల కోసం ఏర్పాట్లు మొదల య్యాయి. ఈసారి కూడా గణేష్ పండుగ కోసం ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకు న్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ గణేష్ ప్రత్యేకా కర్షణ. ప్రతి ఏడాది విశేష అలంకరణతో భక్తుల కు దర్శనమిచ్చే ఖైరతాబాద్ గణపతి ఈసారి మరింత శోభాయమానంగా తయార య్యాడు. వినాయకుడిని పూజిస్తే లోకకల్యాణం జరుగుతు ందని, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని నమ్మకం. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు, సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానాలు అందించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందచేశారు.

# బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒకరోజు విరామం తీసుకున్న వోట్ అధికార్ యాత్ర మంగళవారం తిరిగి ప్రారంభమైంది. ఆదివా రం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీమాట్లాడుతూ.. బీహార్‌లోని అన్ని భారత కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నా యన్నారు. మంచి ఫలితాలుంటాయని చెప్పారు. ప్రతిపక్ష కూటమిలోని అన్ని నియోజకవర్గాలు ఐక్యంగా పనిచేస్తున్నాయి. మేం సైద్ధాంతికంగా,రాజకీయంగా కలుపుకుపోతున్నా మన్నారు. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ పోతున్నామన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.

# విశాఖలో రెండు యుద్ధనౌకలు జాతికి అంకితం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థం ఈ నౌకల సొంతం అని తెలిపారు. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ నౌకలు ప్రతీక. ఆత్మనిర్భర్ భారత్‌కి ఇవి నిదర్శనం.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ

గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రెండు లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేసామని, 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు జమ చేసామని, అన్ని రకాల పరిశ్రమలు, గృహ అవసరాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు.వస్త్ర పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ (ఐ.ఐ.ఐహెచ్.టి) ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. మహిళలు గౌరవంగా స్వీకరించేలా నాణ్యమైన చీరలు తయారు చేయాలని 450 రూపాయలు ఒక్క చీర పై ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,....చేనేత పవర్ రూం కార్మికులను ఆదుకోవాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక స్థితిగతులను బాగు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల, నూతన రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు.విద్య పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు.

# ఎలక్ట్రిక్ వాహన రంగంలోకి మారుతి

- తొలి ఇవి- విటారా ఉత్పత్తి ప్రారంభం
- వంద దేశాలకు ఎగుమతి లక్ష్యంగా ఉత్పత్తులు
- గుజరాత్ హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ప్రారంభించిన మోదీ





**గాంధీనగర్, ఆగస్టు 26:** భారత ప్రభు త్వం ఎలక్ట్రిక్ వాహనాలకు అందిస్తున్న ప్రోత్సాహంతో అనేక కంపెనీలు భారత అవసరాలతో పాటు- విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలక్ట్రిక్ కార్లు, ఈవీ స్కూటర్లను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ కారు విదేశాల్లోనే అమ్మకాలకు సిద్ధం అయ్యింది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని హన్సల్‌పూర్ మారుతీ సుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారా తో పాటు- హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో పాల్గొన్నారు. భారత్ స్వాలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. 49 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తున్న కారు 144 హెచ్‌పీ శక్తిని, 189 కప టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 61÷ఔర బ్యాటరీ 174 బీహెచ్‌పీని 189 కప టార్క్‌ను విడుదల చేస్తుందని తెలుస్తోంది. అతిపెద్ద బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇస్తుందని కంపెనీ ప్రదర్శించిన వీడియోలో పేర్కొంది. భారత్‌లో ఇ-విటారా తయారీకి రూ.2,100 కోట్లు- వెచ్చించినట్లు- మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాషి టకేయుచి గతంలో తెలిపారు. మారుతీ సుజుకీ ఈవీలు కొనుగోలు చేసేవారికి స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టలేషన్ సపోర్ట్‌ను అందించనున్నట్లు- తెలిపారు. తొలిదశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాలను అందించనున్నట్లు- వివరించారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు మారుతీ సుజుకీ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటు-లోకి తేనున్నట్లు- చెప్పారు.

# భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు

**నేటి నుంచే అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు**

**సవాళ్లకు సిద్ధంగా ఉన్నామన్న ఆర్‌బిఐ**



**వాషింగ్టన్, ఆగస్టు 26:** భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ- విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటే.. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రి స్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, -టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్‌ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందు కెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్ధే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుం దన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.


# స్థానిక ఎన్నికలపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణకు ఆదేశించింది. ఇదిలావుంటే తెలంగాణ కేబినెట్ సమావేశం ఆగస్టు 29న మధ్యాహ్నం 3:30గంటలకు జరగనుంది. సెక్రటేరియట్ లో సీఎం రేవంత్ అధ్యక్షతన ఈ భేటీ- జరగనుంది. బీసీ రిజర్వేషన్లు, అసెంబ్లీ సమావేశాల తేదీ ఖరారు, సర్పంచ్ ఎన్నికలు,కాళేశ్వరం నివేదికపై ప్రధానంగా ఈ భేటీ-లో చర్చించనున్నారు. ముఖ్యంగా అందరు ఎదురు చూస్తోన్న పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై ఈ కేబినెట్ భేటీలో క్లారిటీ రానుంది. సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు కల్పించే బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో రిజర్వేషన్లపై ఇప్పటికే న్యాయ నిపుణుల సలహా తీసుకుంది సబ్ కమిటీ-. ఆగస్టు 28 లోపు ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనుంది . సబ్ కమిటీ- ఇచ్చే నివేదికపై కేబినెట్ లో చర్చించి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనుంది.

# కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం

(మొదటి పేజీ తరువాయి)



ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు- అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు- వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు- బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీ-పీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు. మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు- చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచే వాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ- కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు- చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రం నిధుల కోసమే ఇప్పుడు స్థానిక ఎన్నికలు జరుగుతాయని బండిసంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంచాయితీలకు ఒక్క పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలపై ప్రజలు కొట్టేట్లు ఉన్నారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కరీంనగర్ లో ఒక్కో మైనార్టీ ఇంట్లో 200 ఓట్లున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో అధికారం ఎలా వచ్చిందని బండి ప్రశ్నించారు. ఎన్నికలున్నా.. లేకున్నా హిందూ ధర్మం కోసం నిలబెడతాం అని స్పష్టం చేశారు. భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు వాళ్లెక్కడికి వెళ్లారని నిలదీశారు.

## సీతక్క, కలెక్టర్ సూచనలతో ములుగులో అదనపు యూరియా సరఫరా

**-వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్**



**ములుగు,ఆగస్టు 26,(డిడి9 వార్త):** గత సంవత్సరము ఈ సమయానికి ములుగు జిల్లాలో 10 వేల 20 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేయటం జరిగిందని, ఈ సంవత్సరము 10 వేల 720 మెట్రిక్ టన్ను సరఫరా చేయటం జరిగిందని మంగళ వారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,గార్ల సూచనలు మేరకు ములుగు జిల్లాకి 27వ తారీకు నాడు 500 మెట్రిక్ టన్నులు, 31వ తారీకు నాడు మరొక 500 మెట్లు యూరియా సరఫరా చేయబడుతుంది. అదేవిధంగా సెప్టెంబర్ మాసానికి కావలసినటువంటి 4,000 మెట్రిక్ టన్లు ములుగు జిల్లాలో రైతు సోదరులకు సరఫరా చేయుటకు ఏర్పాటు చేయటం జరిగింది. కావున రైతు సోదరులు ఎవరూ కూడా యూరియా కొరకు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలియజేస్తున్నాము.

## ఆదివాసిలో ఆణిముత్యం కాక నాగలక్ష్మి

**సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ సీటు**
**పల్లెటూరి నుంచి జాతీయ స్థాయి యూనివర్సిటీ వరకు ప్రయాణం**
**తల్లిదండ్రుల ప్రోత్సాహం గురువుల మార్గనిర్దేశం**
**గిరిజన సమాజానికి స్ఫూర్తి**





**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 26,(డిడి9 వార్త):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం గంగదేవి గుప్ప గ్రామానికి చెందిన కోయ తెగ ఆణిముత్యం కాక నాగలక్ష్మి, సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ లో ప్రవేశం సాధించి తన పట్టుదల, కృషికి నిదర్శనంగా నిలిచింది. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, గురుకుల కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసిస్తూ ముందుకు సాగిన ఆమె ప్రయాణం, విద్య ద్వారా జీవితం మార్చుకోవాలనుకునే ప్రతి గ్రామీణ విద్యార్థికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.నాగలక్ష్మి తండ్రి కాక కృష్ణ వ్యవసాయ కూలీ. తల్లి కాక పద్మ పదవ తరగతి వరకు మాత్రమే చదివినా, చదువుపై ఉన్న అవగాహనతో తన కూతురిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ చదువు కొనసాగించేలా ప్రేరేపించింది. చిన్నప్పటి నుంచి చదువులో మంచి ప్రతిభ కనబరిచిన నాగలక్ష్మి, ప్రాథమిక విద్యను గంగదేవిగుప్ప ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేసి, పాల్వంచలోని శ్రీ సరస్వతి శిశు విద్యా మందిర్ లో ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివింది. భద్రాచలం లిటిల్ ఫ్లవర్ స్కూల్లో పదవ తరగతి పూర్తిచేసిన తర్వాత అంకంపాలెం గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో చదువుకుంది.ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఎంట్రెన్స్ పరీక్ష రాసి కొత్తగూడెంలో ఉన్నటువంటి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో బీఏ హెచ్ఐపీ విభాగంలో సీటు సాధించి డిగ్రీ ప్రారంభించింది. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షల సమయంలోనే ఒక పెద్ద విషాదం ఎదురైంది. ఆమె తండ్రి కాక కృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చివరికి మరణించగా, ఆ విషయాన్ని విద్యకు ఆటంకం కలగకూడదన్న ఆలోచనతో తల్లి పద్మ కొంతసేపు దాచిపెట్టింది. అదే రోజు అంత్యక్రియలు పూర్తి చేసి మరుసటి రోజు ఉదయాన్నే పరీక్ష రాయడానికి వెళ్లిన నాగలక్ష్మి, ఆ కష్ట సమయంలోనూ ధైర్యాన్ని కోల్పోకుండా పట్టుదలతో పరీక్షలు పూర్తి చేసింది. చివరికి డిస్టింక్షన్‌తో డిగ్రీ పూర్తి చేసి తన ప్రతిభను చాటుకుంది.తరువాత ఉన్నత విద్య కోసం సెంట్రల్ యూనివర్సిటీలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశం కోసం నిర్వహించే సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సియుసిఇటి)లో ఉత్తీర్ణత సాధించి, అనంతపురంలో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ విభాగంలో సీటు సాధించడం ద్వారా తన కలను నిజం చేసుకుంది.తన జీవిత ప్రయాణంలో ఎదురైన కష్టాలు, ఇబ్బందులు, కుటుంబ ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత విషాదాలను తట్టుకుని ముందుకు సాగిన కాక నాగలక్ష్మి, గిరిజన సమాజానికి ఒక స్ఫూర్తిదాయకమైన ఆదర్శంగా నిలిచింది. "ఉన్నత చదువులు పూర్తిచేసి మంచి ఉద్యోగం పొంది తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలి" అనేది ఆమె మనసులో పెట్టుకున్న ఒకే సంకల్పం. ఆ దిశగా పట్టుదలతో కష్టపడుతూ సాధించిన విజయం నేటి యువతకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది.కాక నాగలక్ష్మి సాధించిన ఈ విజయంతో మారుమూల గిరిజన గ్రామాలలో చదువుతున్న విద్యార్థులకు కొత్త ఆశాకిరణం కనిపిస్తోంది. పట్టుదలతో చదువుకుంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని ఆమె నిరూపించింది.

## దామ లచ్చవ్వ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి,ఆగస్టు26,(డిడి9 వార్త ):** పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్ మండల రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త దామ మొండయ్య తల్లి దామ లచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఈ సందర్భంగా గౌరవ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గ్రామానికి వెళ్లి, దామ లచ్చవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

## నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ములుగు జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి ఐపిఎస్





**ములుగు,ఆగస్టు 26,(డిడి9 వార్త):** ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జిల్లా ఎస్పీ శబరిష్.పి,ఐపీఎస్ నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ శబరిష్ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ప్రతిష్టించే ప్రతి ఒక్కరు కూడా ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చూడాలని అన్నారు. అలాగే విగ్రహాల ఏర్పాటు అనంతరం వాటిని జియో టాగింగ్ చేయాలని సూచించారు. మండపాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ కావలసిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు.కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతికేసులోను తప్పనిసరిగా సాక్షులకు, ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ లు విధులు నిర్వహించాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని ఆదేశించారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.అదే విధంగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణ పైన నిఘా ఉంచాలని అన్నారు. చెక్ పోస్టులలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఇసుక అక్రమ రవాణా ను కట్టడి చేయాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు.రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు.యువత ఆన్లైన్ బెట్టింగ్ వలలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ ని ప్రోత్సహిస్తే వల్ల పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారి చేశారు.యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శంకర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కుమార్, సిఐ ఏటూరునాగారం శ్రీనివాస్ , సిఐ ములుగు సురేష్, సిఐ వెంకటాపురం రమేష్, సిఐ పస్రా దయాకర్, ఎస్ఐ ములుగు వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటాపూర్ రాజు, ఎస్ఐ పస్రా కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ ఏటూరునాగారం రాజ్ కుమార్, ఎస్ఐ మంగపేట సురేష్, ఎస్సై కన్నాయిగూడెం వెంకటేష్, ఎస్ఐ వాజేడు సతీష్ , ఎస్ఐ పేరూరు కృష్ణ ప్రసాద్, ఎస్సై వెంకటాపురం తిరుపతి, డిసిఆర్బి ఎస్సై జగదీష్, మరియు ఐటీ కోర్ టీం, డిసిఆర్బి పాల్గొన్నారు

## మట్టి గణపతులనే పూజిద్దాం - పర్యావరణాన్ని రక్షిద్దాం

**-అల్లెంకి శ్రీనివాస్**



**పెద్దపల్లి,ఆగస్టు26,(డిడి9 వార్త):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో పర్యావరణ హిత మట్టి వినాయక విగ్రహాల తయారీ, ప్రదర్శన మరియు పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీ విధానాన్ని తెలియపరిచినట్లు గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు స్వయంగా చేతులతో మట్టి వినాయకులను తయారుచేసి, ఆ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (విగ్రహాల కంటే మట్టి విగ్రహాలు నీటిలో త్వరగా కరిగి, ప్రకృతిని కలుషితం చేయవు.నదులు, చెరువులు, జలాశయాలలో జీవించే చేపలు, జలజీవులపై హానికరమైన ప్రభావం ఉండదు. కరెస్పాండెంట్ అల్లెంకి రజనీ శ్రీనివాస్ వినాయక చవితి విశిష్టతను వివరిస్తూ వినాయక చవితి అనేది మన ఆరంభ దేవుడైన శ్రీ వినాయకుని పుట్టిన రోజు. ఆయన్ని విఘ్ననాశకుడు, బుద్ధి ప్రదాత, మరియు శుభ కార్యాల ప్రారంభ కర్తగా భావిస్తారు. ఈ పండుగ ద్వారా పిల్లలలో సాంస్కృతిక మర

## మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించిన .జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.



**ములుగు,ఆగస్టు 26,(డిడి9 వార్త):** వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జితో కలిసి వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగాంగ 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలని తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాలుష్య నియంత్రణ మండలి ఏ ఈ ఎం సుభాష్ నాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాణమ్మ కుటుంబాన్ని పరామర్శించిన దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి,ఆగస్టు 26,(డిడి9 వార్త):** పెద్దపల్లి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, 8 వార్డు అధ్యక్షులు వడ్డేపల్లి తిరుపతి తల్లి వడ్డేపల్లి బాణమ్మ అనారోగ్య కారణాల వలన వారి స్వగ్రామం కన్నాలలో ఇటీవల మృతి చెందగా, మంగళవారం వారి కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, %దీ=వా% పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి, వడ్డేపల్లి బాణమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, చొప్పరి అన్వేష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**వాజేడు,ఆగస్టు 26,(డిడి9 వార్త):** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు చెరుకూరు మురుమూరు గ్రామాలకు చెందిన వ్యక్తులు అనారోగ్య పాలై ఆసుపత్రిలో అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోయిన రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిధులు మంజూరు చేయడం జరిగింది సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన లబ్ధిదారులకు వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది పేరూరు గ్రామానికి చెందిన ఎస్.కె నసీమా కు ఒక లక్ష 32000 చెరుకూరు గ్రామానికి చెందిన కాకర్లపూడి లావణ్య కు 60000 మురుమూరు గ్రామానికి చెందిన బోధ బోయిన చంద్రశేఖర్ కు 37,500 రాంపురం గ్రామానికి చెందిన ఇస్తారికి 36,000 ల చెక్కులను అందజేయడం జరిగింది ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ అనారోగ్య పాలయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా నష్టపోయిన వ్యక్తులకు ప్రతినెల ప్రతి మండలానికి ఐదు లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతుందని దీనిలో భాగంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సర్వతో లబ్ధిదారులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా అనారోగ్య పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా నష్టపోయిన వ్యక్తులు సీఎం రిలీఫ్ ఫండ్ కు అప్లై చేసుకోవాలని ఆయన కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాథరాజు మైనార్టీ నాయకులు ఎస్.కె ఖాజావలి చెన్నం శ్రీను పసుల లక్ష్మణ్, చెన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## సుదర్శన్ నగర్ కాలనీలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**శేరిలింగంపల్లి, ఆగస్టు 26 (డిడి9 వార్త):** శేరిలింగంపల్లి పరిధిలోని సుదర్శన్ నగర్ కాలనీలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు రాజశేఖర్,కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను కాలనీ నివాసులకు పంపిణీ చేశారు.పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను వాడటం ద్వారా నీటి కాలుష్యం నివారించవచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇది దోహదం చేస్తుందని ఆయన తెలిపారు.

# జీవితం లో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధనకు ప్రయత్నించాలి -జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు,ఆగస్టు 26,(డిడి9 వార్త):**మంగళ వారం కన్నాయిగూడెం మండలం లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు ఒకే తరగతి గతిలో కూర్చబెట్టి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అప్పటికే 10 తరగతిలో ఉపాధ్యాయుడు సోషల్ స్టడీస్ బోధిస్తుండడంతో ఆ పాఠానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. సమస్యలేవైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కన్నాయిగూడెం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి , ఆరోగ్య కేంద్రంలోని జనరల్ ఇన్ పేషెంట్ వార్డ్ను, ల్యాబ్ టెక్నీషియన్ గదిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్యాధికారులు మరియు వైద్య సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలని,





ఉద్యోగులు నిర్దేశిత, హెడ్- క్వార్టర్లలో ఉండి, ప్రజల అనారోగ్య సమస్యలు, వర్షకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి , సేవలు అందించాలని, జనరల్ ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని, వైద్యాధికారి, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల ఆరా తీశారు. జనరల్ ఓపి రిజిస్టర్ ను పరిశీలించి, ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు ఎంతమంది వస్తున్నారని, జ్వరంతో వచ్చిన ప్రతి వ్యక్తికి మలేరియా డెంగ్యూ ఆర్డిటి పరీక్షలు చేయాలని, వర్షా కాలానికి సరిపడే మలేరియా డెంగ్యూ ఆర్ డి టి కిట్లు మరియు మందులు అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, లేని ఎడల జిల్లా కార్యాలయానికి ఇండెంట్ పెట్టి మందులను సమకూర్చుకోవాలని వైద్యాధికారునికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ, ఎం పి డి ఓ సాజిద, హెడ్మాస్టర్ రాజ శేఖర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుడు డాక్టర్ అభినవ్, ఉపాధ్యాయులు నరేష్, కోటయ్య, లక్ష్మయ్య , విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ నగర్ బేతెల్ గాస్పెల్ చర్చ్‌లో ఆటల పోటీలు, బహుమతుల ప్రదానం



**శేరిలింగంపల్లి, ఆగస్టు 15 (డిడి9 వార్త):**స్వతంత్ర దినోత్సవం నాడు ఎన్టీఆర్ నగర్ బేతెల్ గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో పిల్లల కోసం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు మంగళవారం చర్చ్ ప్రాంగణంలో అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, పాస్టర్ గోపి గారు గతంలోనూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ముఖ్యంగా చదువుకునే పిల్లలకు ఉచితంగా ట్యూషన్స్ చెప్పడం, భోజనం ఏర్పాటు చేయడం సమాజానికి ఆదర్శమని అభినందించారు. పిల్లలకు ఉచిత విద్య అందించి వారి భవిష్యత్తు బంగారు బాటలో నడిపిస్తున్న గోపి గారికి తన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, ఖలీమ్, కటికరవి, పాషా, ప్రసాద్, యోగి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోర వైఫల్యం కార్పొరేటర్ రోజాదేవి



**శేరిలింగంపల్లి ,ఆగస్టు 26 (డిడి9 వార్త):**శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగరావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు కనీసం వెయ్యి నుండి రెండు వేల వరకు మట్టి విగ్రహాలను అందజేసి పర్యావరణ అవగాహన పెంపొందించిందని రోజాదేవి గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మంచి సంప్రదాయాన్ని పూర్తిగా విస్మరించిందని, స్వయానా ముఖ్యమంత్రి మరియు మున్సిపల్ శాఖ మంత్రి అయిన రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యం కారణంగా ఈసారి ప్రతి డివిజన్‌కు కేవలం 200 విగ్రహాలకే పరిమితం చేసినట్లు ఆమె విమర్శించారు. ప్రజలకు లభించాల్సిన సౌకర్యాలను కత్తిరించడం, పర్యావరణహిత కార్యక్రమాలను అణచివేయడం ప్రస్తుత ప్రభుత్వ తీరును బహిర్గతం చేస్తోందని రోజాదేవి మండిపడ్డారు. మాటలకే పరిమితమైన రేవంత్ రెడ్డి ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో పూర్తిగా విఫలమయ్యారని, ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజలు తప్పకుండా గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు

# విద్యార్థుల చేత ప్రకృతి హిత వినాయక విగ్రహాల తయారీ

**వాజేడు, ఆగస్టు 26 (డిడి9 వార్త):** ములుగు జిల్లా వాజేడు మండలంలోని నాగారం ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణానికి హాని చేయని ప్రకృతి హితమైన వినాయక విగ్రహాలను విద్యార్థుల చేత తయారు చేయించి, వారికే పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు మాట్లాడుతూ, కృత్రిమ విషపూరిత రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలు వాడటం వలన వాతావరణ కాలుష్యం, జల కాలుష్యం, వాయు కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవు తాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోరిక స్వరూప్ సింగ్, చల్లగురుగుల మల్లయ్య, వెంకట రమణ, రంగు ఆనంద్, పోరిక రవి కుమార్, బొగ్గం కుమార్ బాబు, కంచు ప్రభాకర్, షిండే రాజేష్, కోకిల శ్రీరంగం, జర్పుల వస్య తదితరులు పాల్గొన్నారు.





# గణపతి అంటే ప్రకృతి పర్యావరణహిత విగ్రహాలే మన సంప్రదాయం

## - ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, ఆగస్టు 26 (డిడి9 వార్త):**ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేజ్-2 జలకన్య హోటల్ వద్ద సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుల ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ పిఏసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ హాజరై, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, జగన్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులతో కలిసి మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించుకోవాలని సూచించారు. "వినాయకుడి ప్రతిమను మట్టితో తయారు చేయడం, ఆకులతో అలంకరించడం, పూలతో




పూజించడం, నీటిలో నిమజ్జనం చేయడం ఇవే మన సనాతన సంప్రదాయాలు. గణపతి అంటే కేవలం ఆకృతి కాదు, ఆయన ప్రకృతే. కాబట్టి మట్టి వినాయకులను పూజించడం మన సమాజం, మన పర్యావరణం కోసం తప్పనిసరి" అని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు చెరువులను కలుషితం చేస్తాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరించిన గాంధీ గారు, భావితరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను మాత్రమే పూజించాలని కోరారు. అదేవిధంగా, చెరువులను కాపాడేందుకు వీలైనంతవరకు స్వగృహ ప్రాంగణంలోనే నిమజ్జనం చేయాలని సూచించారు. మహిళలు ఈ అవగాహనలో ముందుండాలని, సమాజం మొత్తం పర్యావరణహిత గణపతిని పూజించడానికి కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం మనందరి కర్తవ్యం. మొక్కే శ్రీరామ రక్ష. మొక్కలు నాటడం మాత్రమే కాక, వాటిని కాపాడుకోవడం మన సామాజిక బాధ్యత" అని గాంధీ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, సాంస్కృతిక సేవా సమితి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

# వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు





**శేరిలింగంపల్లి ,ఆగస్టు26,(డిడి9 వార్త):**హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ రోడ్, ఆంబీర్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కొలను వద్ద ఏర్పాట్లను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కెపిహెచ్బి సీఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మాధవ్ రెడ్డి, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు నిబంధనలు పాటిస్తూ, అధికారులు సూచించిన విధంగా భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం జరుపుకోవాలని శ్రీనివాసరావు గారు సూచించారు. అలాగే నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ డి.ఇ. స్వప్న, ఇన్‌ఛార్జి సుధాకర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# రూ.1.50 కోట్లు అంచనావ్యయంతో మియాపూర్‌లో వరద నీటి కాల్వ నిర్మాణం

## - పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధి

**శేరిలింగంపల్లి , ఆగస్టు 26,(డిడి9 వార్త):**

మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎనక్లేవ్ కాలనీ నుండి బొల్లారం మెయిన్ రోడ్డువరకు సుమారు రూ.1 కోటి 50 లక్షల అంచనావ్యయంతో చేపట్టిన వరద నీటి కాల్వ నిర్మాణ పనులను గౌరవ పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి మరియు ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, "మియాపూర్ ప్రాంతంలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఈ కాల్వ నిర్మాణ పనులను ప్రారంభించాం. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు వేగవంతం చేసి, ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలి. నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి," అని తెలిపారు. అలాగే





పనుల నాణ్యతపై ఎక్కడా రాజీ పడకూడదని అధికారులు సూచించారు. "ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలి. ఎన్నో ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ఈ పనులు ఉపయోగపడతాయి. కాలనీ వాసులు, ప్రయాణికులు, వాహనదారులు అందరూ దీని వల్ల లాభం పొందుతారు," అని గాంధీ గారు పేర్కొన్నారు. "శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం" అని గాంధీ గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శరత్ రెడ్డి, మేనేజర్ సునీత, ఇంజనీరింగ్ విభాగం ఏఈ సంతోష్, వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్, ఎలక్ట్రికల్ ఏఈ రవిచంద్రతో పాటు నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుదాం

## -శిరీష సత్తూర్



**శేరిలింగంపల్లి,ఆగస్టు 26,(డిడి9 వార్త):** 124 డివిజన్ ఆల్విన్ కాలనీ ఫేస్%-%2, ధరణి నగర్‌లో సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శేర్లింగంపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతు ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. కాలుష్య రహిత మట్టి వినాయకులను పూజించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించగలమని, ఇది మనందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్ చారి, సాయి ప్రభాకర్, రమేష్, వివేక్, సమ్మారెడ్డి, లహరి, గాయత్రి పాల్గొన్నారు.

# మొక్కలే మనుగడకు శ్రీరామరక్ష

## -అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి ,ఆగస్టు 26,(డిడి9 వార్త):**ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ క్రిస్టియన్ స్మశాన వాటికలో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు ఈ సందర్భంగా అరికెపూడి గాంధి మొక్కలు నాటడం ద్వారా కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు అనంతరం అరికెపూడి గాంధీ మాట్లాడుతూ మొక్కలే మనుగడకు శ్రీ రామ రక్ష అన్నారు. క్రిస్టియన్ స్మశాన వాటికను అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దామని, ఈ వనమహోత్సవం ద్వారా స్మశాన వాటికను పచ్చదనంతో నింపి హరితవైభవం కల్పించామని పేర్కొన్నారు. స్మశాన వాటిక పచ్చని మణిహారంలా మారుతుందని, కాలనీ రహదారుల రెండు వైపులా, అంతర్గత వీధుల్లో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. మొక్కలు నాటడం ఒక రోజు చేసే పని కాదని, వాటిని



సంరక్షించి పెద్దవిగా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గాంధీ గుర్తు చేశారు. మొక్కలు పెరిగితే అపార్ట్మెంట్ వాసులకు, కాలనీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, పండ్ల జాతులు, ఔషధ గుణాలు గల మొక్కలు నాటడం ద్వారా ప్రజలకు నేరుగా లాభం చేకూరుతుందని ఆయన అన్నారు. తెలంగాణలో అడవుల శాతం పెరిగిందని, లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మానవాళి మనుగడకు మొక్కలే శ్రీరామ రక్ష అని, కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్



ఎంత ముఖ్యమో మనమందరం చూశామని, అందువల్ల మొక్కలు నాటడం తప్పనిసరి కర్తవ్యమని గాంధీ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా, మేనేజర్ శివ జ్యోతి, సూపర్వైజర్ నాగ రాణి, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మల్లేష్, మహేష్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రాంచందర్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాస్టర్లు ఇశ్రాయిల్, కోకిల శ్యాముల్, సత్యరాజు, ఫిలిప్, నాగభూషణం, శామ్యూల్, ముకేశ్, ఎలీషా, దాస్, దేవదాస్, డేవిడ్ రాజు, సతీష్ కుమార్, షాలేం రాజు, శ్రీనివాస్, జి.సుమన్, ఎం.సుమన్, న్యూటన్ బాబు, సిమోన్, విక్టర్ ఇమాన్యుల్, జోషాప్ తదితరులు కూడా పాల్గొని వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# జైపాల్ రెడ్డిని పరామర్శించిన సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ,బండి రమేష్

**(డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు జైపాల్ రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్ర రెడ్డి ఇటీవల పరమపదించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ జైపాల్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామచంద్ర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



# అధికారులపై మండిపడ్డ ఎంఎల్ఏ మాధవరావు








**కూకట్‌పల్లి, ఆగస్టు 26 (డీడీ9 వార్త):** కేపిహెచ్బి డివిజన్ 4వ ఫేస్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ దుర్వినియోగం, నిర్లక్ష్య సంరక్షణపై కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఫంక్షన్ హాల్‌ను పరిశీలించినారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నిరుపేదలకు మేలు చేకూర్చే ఉద్దేశ్యంతో ఈ ఫంక్షన్ హాల్ నిర్మించాం. అప్పట్లో ఎంతోమంది ప్రజలు దీన్ని వివాహాలు, శుభకార్యాల కోసం ఉపయోగించుకున్నారు. అయితే, ఇప్పుడు సరైన మెయింటెనెన్స్ లేకుండా వదిలేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. జంతువుల వాడకం, వ్యర్థాల పేరుకుపోవడం, అద్దాలు పగిలిపోవడం వంటి సమస్యలతో పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది" అని అన్నారు. తక్షణమే మరమ్మత్తులు చేసి, హాల్‌ను శుభ్రంగా, వినియోగదాయకంగా మార్చాలని అధికారులను ఆయన ఆదేశించారు. లేకపోతే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, రమేష్, శంకర్, హెచ్ఎం డబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కేపిహెచ్బి డివిజన్‌లో వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు





**కూకట్పల్లి, ఆగస్టు 26, (డిడి9 వార్త):** కేపిహెచ్బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి కలిసి కేపిహెచ్బి డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే వేలకోట్ల రూపాయల పనులు విజయవంతంగా పూర్తి చేశామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు కూడా నేడు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, అప్పటి మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన వంద పడకల ఆసుపత్రి పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని కార్పొరేటర్ విశ్వాసం వ్యక్తం చేశారు

## జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పు

**నల్లగొండ, ఆగస్టు 26:** జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. పోక్సో కేసులో తిప్పర్తికి చెందిన మహమ్మద్ ఖయ్యూంను దోషిగా తేల్చింది న్యాయస్థానం. నిందితుడికి 51 ఏళ్ల శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రోజారమణి తీర్పు వెల్లడించారు. అత్యాచారం కేసులో 20 ఏళ్లు, పోక్సో కేసులో 20 ఏళ్లు, ఎస్సీ ఎస్టీ కేసులో పదేళ్లు, సెక్షన్ 506(మైనర్ బాలికపై బెదిరింపులు) కేసులో మరో ఏడాది శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పునిచ్చారు. నిందితుడు ఖయ్యూం 2021లో తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. ఆపై విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఖయ్యూంపై రేప్ కేసు నమోదు చేశారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో న్యాయస్థానానికి సరైన సైంటిఫిక్ ఎవిడెన్స్ సమర్పించడంతో నిందితుడు శిక్ష నుంచి తప్పించుకోలేకపోయాడు.

## సీఎం రేవంత్‌రెడ్డి సోయి లేకుండా మాట్లాడుతున్నారు : దేవీప్రసాద్



**హైదరాబాద్ :** కేసీఆర్‌ను తాము తెలంగాణ తొలి సీఎంగా మాత్రమే చూడటం లేదని, ఆయన గొప్ప ఉద్యమకారుడని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ అన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను మానవ మృగమని అనడం దారుణమని, సీఎం రేవంత్ రెడ్డి సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో లేదని, రేవంత్ కేసీఆర్‌పై వాడిన భాషను ఒక ఉద్యమకారుడిగా తాను ఖండిస్తున్నానని అన్నారు. రేవంత్ రెడ్డి కొందరు ఉద్యమకారులను అడ్డుపెట్టుకుని కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని దేవీప్రసాద్ విమర్శించారు. కేసీఆర్ పాలనలో లోపాలు ఉంటే ప్రశ్నించవచ్చని, కానీ ఉద్యమకారుడు కేసీఆర్ గురించి తెలంగాణ గడ్డ మీద అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. కేసీఆర్‌ను సీఎం తిడుతుంటే చప్పట్లు కొట్టేవారు ఉద్యమకారులు కానే కారని వ్యాఖ్యానించారు. ఉస్మానియా అనేక భావజాలాలు వికసిల్లిన యూనివర్సిటీ అని, అలాంటి యూనివర్సిటీ వేదికగా సీఎం పిచ్చి మాటలు మాట్లాడతారా..? అని దేవీప్రసాద్ మండిపడ్డారు. యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలు చూసి కూడా సీఎం రేవంత్ రెడ్డికి వారిని ఆదుకోవాలని లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి బీఆర్ఎస్ ప్రశ్నించడం ఆపదని అన్నారు.

## హైదరాబాద్ ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

**హైదరాబాద్, ఆగస్టు 26:** నగరంలోని మెహిదీపట్నం బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఇంజిన్ భాగంలో ఒక్కసారిగ మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తం అయ్యాడు. బస్సును పక్కకు నిలిపివేసి.. ప్రయాణికులందరినీ కిందకు దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బస్సు ముందు భాగం మొత్తం పూర్తిగా దగ్ధం అయిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరిగిందిలా..మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. లింగంపల్లి నుంచి మెహిదీపట్నం చేరుకుంది. అదే సమయంలో బస్సు ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో డ్రైవర్.. బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. బస్సును సెల్ఫ్ స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదు. ప్రయాణికులందరూ కిందకు దిగిపోయారు. ఆ తరువాత డ్రైవర్ బానెట్ ఓపెన్ చేసి కేబుల్స్ సరి చేసే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో బస్సు ముందు భాగంలో మంటలు చెలరేగాయి. బస్సు ముందు భాగం పూర్తిగా దగ్ధం అయ్యింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను పూర్తిగా ఆర్పేశారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రమాదానికి గల కారణాలను ఆర్టీసీ మెకానికల్ విభాగం సిబ్బంది విశ్లేషిస్తున్నారు.

# అంతర్ జిల్లా మేకల దొంగల ముఠా అరెస్ట్




**- రూ.2.40 లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు సీజ్**
**- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నీలగిరి, ఆగస్టు 26 :** ఖరీదైన కార్లలో రాత్రి సమయాల్లో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న 16 మందితో కూడిన నాలుగు అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ.2.46 లక్షల నగదు, 22 గొర్రెలు, రూ.17 లక్షల విలువ గల 8 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వెలడించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా జిల్లాలో మేకలు, గొర్రెలు వరుసగా చోరీకి గురైతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం సమయంలో శాలిగౌరారం మండలంలోని బైరవోనిబండ క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో అటుగా వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారును తనిఖీ చేసేందుకు దగ్గరకు వెళ్తుండగా అందులోని వారు తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. వెంటనే వాహనాన్ని వెంబడించి పట్టుకోగా అందులో ముగ్గురు పురుషులు, ఓ మహిళ ఉన్నట్లుగా తెలిపారు. వారి వేలి ముద్రలను స్కాన్ చేయడంతో సంఘం, వెంకటేశ్, వెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్ కుమార్ అలియాస్ కోటిగా గుర్తించినట్లు తెలిపారు. వీరిపైన గతంలో నల్లగొండ రూరల్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, నల్లగొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పోలీస్ స్టేషన్లలో మేకల దొంగతనాల కేసులు నమోదై అరెస్టై జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. వీరితో పాటు పరిచయం ఉన్న మరో 12 మందితో కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ఒక గ్యాంగ్‌గా వరికుప్పల రవి ఏ చింటూ, గండికోట శివకుమార్, అమ్ములూరి విజయ్, వరికుప్పల రాజు, లింగాల ఆశోక్, ఉండం కళ్యాణి, కౌటేశ్ ( లక్ష్మీ, కనుకుల బేబీ, రెండో గ్యాంగ్‌గా వల్లెపు ప్రసాద్, మత్యాల సహదేవ్, మూడో గ్యాంగ్‌గా కోడిసే వంశీ కృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్ కుమార్, మట్టి సురేశ్ నాలుగు గ్యాంగ్‌లుగా ఏర్పడినట్లు తెలిపారు. వీరంతా ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి సమయాల్లో వచ్చి మేకలు, గొర్రెలను కార్లలో వేసుకుని దొంగతనాలకు పాల్పడేవారన్నారు. విచారణలో వీరంతా జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకల దొంగతనాలకు పాల్పడినట్టు తేలిందన్నారు. దొంగలించిన మేకలను సంతల్లో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవారన్నారు. మొత్తం 23 నేరాలకు సంబంధించి 200కు పైగా మేకలు, గొర్రెలు అమ్మినట్లు తెలిపారు. కేసును నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి పర్యవేక్షంలో చేధించారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నల్లగొండ సీసీఎస్ సీఐలు ఎం.జితేందర్ రెడ్డి. ఎం.నాగభూషణ్, శాలిగౌరారం సీఐ కె.కొండల్ రెడ్డి, నార్కట్ పల్లి సీఐ కె. నాగరాజు, ఎస్ఐలు శివకుమార్, విజయ్ కుమార్, రవి, రవి కుమార్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన గిరి, వహీద్ పాషా, సూఫీయాన్ అలీ, రామ్ ప్రసాద్, నాగరాజు, సీసీఎస్ కానిస్టేబుల్ ఆశ్రార్, మహేశ్, సాయి, వెంకట్ రామ్‌ను ఎస్పీ

## రేవంత్ రెడ్డి ప్రవర్తన బాగలేదు : జోగు రామన్న

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన ఏమాత్రం బాగలేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. మంగళవారం తెలంగాణభవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా కాళేశ్వరం పాట పాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల దగ్గరకు వెళ్లి కూడా కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారని, నిత్యం కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రవర్తన వల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటుందని జోగు రామన్న మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో కట్టిన భవనాలకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేస్తున్నారని, ఆయన కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ ఏమీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా విఫలమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

## మహీంద్రా యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం సృష్టించాయి. 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో సోదాలు నిర్వహించిన పోలీసులు.. కిలోన్నర గంజాయి, 47 గ్రాముల ఓజీ వీడ్ స్వాధీనం చేసుకున్నారు. మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో మహీంద్రా యూనివర్సిటీలో మంగళవారం నాడు పోలీసులు సోదాలు నిర్వహించారు. శ్రీమారుతి కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. గతంలో నైజీరియన్ నిక్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి.. పలు పబ్‌ల్లో విద్యార్థులు పార్టీలు చేసుకున్నట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## మహేశ్వరం మండలం నాగారం భూములపై హైకోర్టు విచారణ

**హైదరాబాద్:** మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వివాదాస్పద భూముల విషయంపై హైకోర్టులో విచారణ జరిగింది. బిర్ల మహేశ్ అనే పిటిషనర్ దాఖలు చేసిన కేసులో ఈ భూములపై ప్రభుత్వ స్పందనను న్యాయస్థానం పరిశీలించింది. సర్వే నంబర్ 194లో 383 ఎకరాలు, 195లో 370 ఎకరాలు ఉన్నాయని హైకోర్టుకు ప్రభుత్వ న్యాయవాది మురళీధర్ రెడ్డి తెలిపారు. అయితే, వీటిలో కేవలం 95.24 ఎకరాలు మాత్రమే నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన భూములన్నీ పట్టా భూములు అని స్పష్టం చేసిన జనరల్ ప్లీడర్, నిషేధిత భూములపై ఇప్పటివరకు ఎలాంటి లావాదేవీలు జరగలేదని కోర్టుకు వెల్లడించారు.

# సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ నాకు తెలియదు



**విజయవాడ:** ఏసీబీ కోర్టులో లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త రాజ్ కసిరెడ్డి తనపై నమోదైన కేసును ఖండిస్తూ వివరణ ఇచ్చారు. కస్టోడియల్ విచారణ అని సిట్ తనన్ను అరెస్టు చేసిందన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో తన పాత్ర ఎక్కడా లేదని, తన తప్పు లేకపోవడంతో తప్పు చేసినట్లుగా ఆధారాలు సృష్టించారని రాజ్ కసిరెడ్డి ఆరోపించారు. తనపై ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా లేదని, గతంలో కూడా ఏ కేసులోనూ తాను అరెస్టు కాలేదని స్పష్టం చేశారు.రూ.11 కోట్లు నావే అయితే నా వేలిముద్రలు ఉంటాయి కదా? రూ.11 కోట్లు క్యాష్ ఒకే వ్యక్తి దగ్గర ఉంటాయా? అని ప్రశ్నించారు. సిట్ అధికారులు సినిమా స్టోరీల కంటే ఎక్కువ కథలు చెబుతున్నారన్నారు. సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ కూడా తనకు తెలియదని చెప్పారు. ఎవరో ఒక ఐదుగురిని విచారణ చేసి నేను తెలుసా అని మీరే అడగండని కోరారు. ఈ కేసులో చాలా మంది పేర్లు తాను తొలిసారిగా వింటున్నట్లు తెలిపారు.

# పశ్చిమగోదావరి కలెక్టరేట్ నిర్మాణంపై రఘురామ క్లారిటీ



**పశ్చిమగోదావరి, ఆగస్టు26:** భీమవరం వేరు, ఉండి వేరుగా తాను చూడటం లేదని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుస్పష్టం చేశారు. కొంత మంది సంకుచిత స్వభావంతో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.(మంగళవారం) పశ్చిమగోదావరి జిల్లాలో రఘురామ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నిర్మాణంపై రఘురామకృష్ణరా జు మాట్లాడారు.నూతన పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడ్డాక కలెక్టరేట్ ఆఫీస్ అద్దె భవనంలో కొనసాగుతోందని తెలిపారు. మార్కెట్ యార్డులో కలెక్టరేట్‌కు స్థలం ఇచ్చారని.. అది ముందుకు వెళ్లలేదని క్లారిటీ ఇచ్చారు. రూ.100 కోట్లు పెట్టి స్థలాన్ని ప్రభుత్వం కొన్నదని.. ఇప్పుడు కలెక్టరేట్ కట్టడం కష్టమని చెప్పుకొచ్చారు. పెద అమిరం గ్రామాన్ని భీమవరం మున్సిపాలిటీలో కలపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు రఘురామకృష్ణరాజు.కలెక్టర్ ఆఫీసుకు రూ.70 కోట్లు అయితే.. రూ.35 కోట్లు ప్రభుత్వం, మరో రూ.35 కోట్లు తాము సమకూర్చామని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కలెక్టర్ ఆఫీసు నిర్మించాలని అనుకుంటున్నామని వెల్లడించారు. మండలి చైర్మన్ ఇరిగేషన్ భూమి అని అన్నారని.. తాను సంకుచిత భావం లేకుండా జిల్లా అంతా ఒక యూనిట్‌గా భావిస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో శంకుస్థాపనకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరానని గుర్తుచేశారు. కలెక్టరేట్‌కు తాను స్థలాన్ని సమకూర్చానని.. సగం ధనాన్ని ఇస్తానని తాను మాట ఇచ్చానని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

# ఐపీఎస్ శ్రీలక్ష్మి ఎవరి వల్ల జైలుకెళ్లిందో గుర్తులేదా భూమనపై బీజేపీ నేత ఫైర్



**అమరావతి:** ఐఏఎస్ శ్రీలక్ష్మిని అవినీతి అనకొండ అంటూ పరోక్షంగా వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహిళపై ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా అని మండిపడ్డారు. ఐఏఎస్ శ్రీలక్ష్మి ఎవరి వల్ల జైలుకు వెళ్లిందో తెలియదా అని ప్రశ్నించారు.టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇప్పుడు రాజకీయ నిరుద్యోగిగా మారారని భానుప్రకాశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత నుంచి ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేనట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఓ మహిళా అధికారిణి పై ఇలాంటి భాషలో మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అసలు ఆమె ఎవరి కారణంగా జైలుకు వెళ్లాల్సి వచ్చిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసుని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే శ్రీలక్ష్మి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్నది నిజం కాదా అని ప్రశ్నించారు.శ్రీలక్ష్మి గురించి భూమన ఏమన్నారంటే..అవినీతిలో అనుకొండ అయిన ఓ అధికారిణి గతంలో మంత్రులను కూడా పూచికపుల్లల్లా చూసిందని ఐఏఎస్ శ్రీలక్ష్మిని ఉద్దేశించి భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. తన శాఖకు సంబంధించిన మంత్రులను లెక్క కూడా చేయలేదని తెలిపారు. డబ్బు సంపాదనే తప్పు.. ఏ నైతిక విలువ లేని మనిషి అని మండిపడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ తాటకిలా కింది అధికారుల పట్ల ఆమె వ్యవహరించేవారని విమర్శించారు.

# ఆమె అవినీతి అనకొండ ఐఏఎస్ శ్రీలక్ష్మీపై భూమన పరోక్ష విమర్శలు




**తిరుపతి:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మీపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతి టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో ఆమె పాత్ర ఉందని తెలిపారు. ఈ కుంభకోణానికి అవినీతిలో అనకొండలాంటి అధికారిణే కారణమని ఆరోపించారు.ఆ ఐఏఎస్ అధికారిణి గతంలో మంత్రులను కూడా పూచికపుల్లల్లా చూసిందని భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. తన శాఖకు సంబంధించిన మంత్రులను లెక్క కూడా చేయలేదని తెలిపారు. డబ్బు సంపాదనే తప్పు.. ఏ నైతిక విలువ లేని మనిషి అని మండిపడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ తాటకిలా కింది అధికారుల పట్ల ఆమె వ్యవహరించేవారని విమర్శించారు.తిరుపతిలో రోడ్లు వేస్తున్న సమయంలో టీడీఆర్ బాండ్ల ద్వారా వందల కోట్లు దోచుకోవాలని ఆ అధికారిణి ప్రయత్నించిందని భూమన ఆరోపించారు. అప్పుడు ఆ అవినీతిని అడ్డుకున్నామని తెలిపారు. దీంతో ఇది తట్టుకోలేకనే నెల్లూరు జిల్లా రైతుకు సమాచారం లీక్ చేసి.. రూ. రెండు వేల కోట్లు దోచుకున్నారంటూ ప్రచారం చేయించిందని పేర్కొన్నారు. ఒక్క రూపాయి కూడా తాము అవినీతి చేయలేదని.. అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే ఏ శిక్షకైనా రెడీ అని ప్రకటించారు. టీడీఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టం చేశారు.ఆ ఐఏఎస్ అధికారిణి 35 ఏండ్లలోనే రూ.వందల కోట్లు లూటీ చేసిందని భూమన ఆరోపించారు. రోజూ లక్షన్నర చీర కట్టే ఆ అవినీతి అధికారిణి జీతమెంత అని ప్రశ్నించారు. ఆమె దగ్గర వేల రూపాయల విలువ చేసే 11 విగ్గులు ఉన్నాయని చెప్పారు. నీతిగా నిజాయితీగా ఉండే తనపై కక్షగట్టి అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. 21 మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసి తిరుపతిని అభివృద్ధి చేశామని తెలిపారు.

# ప్రపంచానికి అనుగుణంగా మారండి బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు




**అమరావతి:** రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, ఎస్ హెచ్ జీ రంగాలు, రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలపై అధికారులతో చర్చించారు.231 ఎస్ఎల్ బీసీలో తీసుకున్న నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సమీక్ష చేసిన సీఎం.. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రపెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చలు జరిపారు. ఎస్ఎల్ బీసీ సమావేశాలు.. రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలని సూచించారు. రొటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇండికేటర్లు కూడా రొటీన్‌గా మారుతున్నాయని చెప్పారు.తీరు మార్చుకోండి ఖరీఫ్‌లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయిందని, ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్ పుట్ ఇవ్వాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని చెప్పుకొచ్చారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాల్సి ఉందన్నారు. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చిందని. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయని.. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదని తెలిపారు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలన్నారు.కొత్త ఆవిష్కరణల దిశగా..అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని అధికారులకు సూచించారు. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవు తుందన్నారు. ఈ క్రమంలోనే ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరని, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావని వ్యాఖ్యానించారు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజా ప్రతినిధిగా పేదల గురించి తాను ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఓ దశలో సంపద సృష్టి కోసం, పరిశ్రమల కోసం దావోస్ లాంటి ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగానన్నారు. దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సమిష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# ఆ పింఛన్ల కొనసాగింపుపై కీలక ఆదేశాలు




**అమరావతి:** అర్హులైన వారందరి పింఛన్లు కొనసాగించాలని సీఎం నారా చంద్రబాబునాయుడు.. అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 18 వేల మందికి పెన్షన్ నిలిపేయడంపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అర్హత ఉన్న పెన్షన్లను తొలగించేందుకు నోటీసులు ఇచ్చారని ఏబీఎన్ లో కథనాలు వెలువడ్డాయి. తమ పెన్షన్ నిలిపేశారంటూ పెద్ద ఎత్తున ఏబీఎన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. వచ్చిన నోటీసు లను కూడా ఏబిఎన్‌కు పంపించారు. దీనిపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రసారమయ్యాయి. 18 సంవత్స రాలలోపు పిల్లలకు వైకల్యం ఉంటే. వారికి అధికారులు తాత్కాలిక దివ్యాంగుల సర్టిఫికేట్ ఇచ్చారు. 18 సంవత్సరాలలోపు శరీరంలో మార్పులు వస్తాయని.. అందువల్ల వారికి తాత్కాలిక సర్టిఫికెట్ ఇవ్వాలన్న కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారం తాత్కాలిక సర్టిపికేట్ ఇచ్చిన 18 వేల మందికి అధికారులు పెన్షన్లు నిలిపివేశారు.ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేయడంతో దివ్యాంగులు గగ్గోలు పెట్టారు. ఏబీఎన్ కథనాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకున్నారు. తాత్కాలిక సర్టిఫికేట్లు ఉన్నవారందరికీ పెన్షన్లు కొనసాగిం చాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అంతక ముందు ఇచ్చిన నోటీసులను ఉపసంహరిం చుకున్నట్లు, పెన్షన్ కొనసాగిస్తున్నామంటూ దివ్యాంగులకు ఏపీ సెర్ప్ నుంచి మెజేస్‌లు వచ్చాయి. పెన్షన్ తొలగింపునకు నోటీసులు ఇచ్చిన 80 వేలమందిలో కూడా అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కథనాలతో సీఎం ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నామని, నిజంగా అర్హులైతే వారి పెన్షన్‌ను పునరుద్దరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# భారీ వర్షాలతో ఏపీ ప్రభుత్వం అలర్ట్



**విశాఖపట్నం, ఆగస్టు26 :** బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల వర్షాలు కురుస్తోండటంతో హోం మంత్రి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు.అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని మార్గనిర్దేశం చేశారు. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర హోర్డింగ్‌లు, కూలిన చెట్లను వెంటనే తొలగించాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలపై అలర్ట్.శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలపై అధికారులను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు మంత్రి అచ్చెన్నాయు డు.ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు. భారీ వర్షాల దృష్ట్యా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి మార్గనిర్దేశం చేశారు. విద్యుత్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులు వర్షాభావ పరిస్థితిని అంచనా వేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# లిక్కర్ స్కామ్‌లో నిందితులకు మళ్లీ రిమాండ్ పొడిగింపు




**విజయవాడ, ఆగస్టు 26:** మద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్ల పర్వం కొనసాగుతోంది. ఈ కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడ జైలుకు... అలాగే మరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారవరోవైపు ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసును ఆయన ఖండించారు. కస్టోడియల్ విచారణ అని సెట్ తనను అరెస్ట్ చేసిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు. తన తప్పు ఎక్కడా లేక పోయినా.. ఆధారాలు సృష్టించారని రాజ్ కసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కానీ.. ప్రస్తుతం కానీ ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా లేదని గుర్తు చేశారు. ఈ ఒక్క లిక్కర్ కేసులో తప్పించి.. ఇప్పటి వరకు తాను అరెస్ట్ కాలేదన్నారు.అయితే హైదరాబాద్, శంషాబాద్‌లోని విల్లాలో లభ్యమైన రూ. కోట్లు తనవైతే.. వాటిపై తన వేలి ముద్రలు ఉంటాయని వివరించారు. అయినా అంత సొమ్ము ఒకే వ్యక్తి వద్ద ఉంటుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ మద్యం కుంభకోణంలో సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ తనకు తెలియదన్నారు. ఈ 300 మందిలో ఒక ఐదుగురిని విచారించి.. వారికి తాను తెలుసేమో మీరే అడగండని తెలిపారు. ఈ కేసులో చాలా మంది పేర్లు తాను తొలిసారిగా వింటునానని రాజ్ కసిరెడ్డి తెలిపారు. ఇంకోవైపు.. మద్యం కుంభకోణంలో కీలక ఆధారాలు లభ్యం కావడంతో.. ప్రధాన నిందితుల్లో ఒకరైన రాజ్ కసిరెడ్డి ఆస్తుల జప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. మద్యం విక్రయాలతో వచ్చిన ఆదాయంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భారీగా భూములను రాజ్ కసిరెడ్డి కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వాటిని సైతం జప్తు చేసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది.

# ఆడుదాం ఆంధ్రాకు రూ.119కోట్లు దారపోశారు

**- 29న స్పోర్ట్స్ అకాడమీలపై ప్రకటన**

**- శాప్ చైర్మన్ రవినాయుడు**




**తిరుపతి:** వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు రూ.119 కోట్లు కేటాయించి, దుర్వినియోగం చేశారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆరోపించారు. నిధులు పూర్తిగా పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని అన్నారు. అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా సోమవారం ఉదయం ఎస్వీక్యాంపస్ హైస్కూల్ మైదానంలో విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో క్రీడా అకాడమీలు రద్దు చేసిందని, వాటిని మళ్లీ ప్రారంభిస్తామని, క్రీడా పాఠశాలల సంఖ్య పెంచుతామని, ఇంటర్ వరకు మంచి శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామని వివరించారు అమరావతి చాంపియన్‌షిప్‌లో పది క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రూ.కోటిన్నర నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు, సదుపాయాలు కల్పించామన్నారు. జాగ్రత్తపడ్డామన్నారు ప్రతి జిల్లాలోనూ క్రీడాకారులను గుర్తించి జోనల్, రాష్ట్రస్థాయి వరకు తెచ్చామని, విజేతలకు సీఎం చంద్రబాబు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా జాగ్రత్తపడ్డా మన్నారు. ఒలింపిక్స్‌లో ఆంధ్రా క్రీడా కారులు మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేశామని స్పష్టం చేశారు. విజయవాడకు చెందిన విలువిద్య క్రీడాకా రులు కె.ఝాన్సీలక్ష్మి, టి.భువనరాజే శ్వరి, కె.యుక్తశ్రీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే గట్టిపోటీ ఎదుర్కొనే అవకాశం లభించిందని, తద్వారా జాతీయ స్థాయి పోటీలు సులభమవుతాయని పేర్కొ న్నారు. సాయంత్రం టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి క్రీడా మైదానాలను సందర్శి ంచారు. క్రీడాకారులతో ముచ్చటిస్తూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఐదు వేదికల్లో పది క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మంగళవారం అంతిమ ఫలితాలు రానున్నాయి.

# కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా కాంగ్రెస్ వ్యక్తిగానే మరణిస్తా

**బెంగళూరు:** అసెంబ్లీలో ఒక చర్చ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రార్థనా గీతాన్ని ఆలపించడం చర్చనీయాంశం కావడంతో కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజాగా స్పందించారు. ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతం ఆలాపనపై కాంగ్రెస్ నేతలు, విపక్ష 'ఇండియా' కూటమి పార్టీల మనోభావాలను గాయపరిచి ఉంటే తాను క్షమాపణ చెప్పడానికి సిద్ధమని అన్నారు.మంగళవారంనాడిక్కడ మీడియాతో డీకే శివకుమార్ మాట్లాడుతూ, బీజేపీని విమర్శించేందుకు తాను ఆ పాట పాడానని వివరణ ఇచ్చారు. అయితే కొందరు రాజకీయ ప్రయోజనాలతో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని చెప్పారు. ఎవరి మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదని అన్నారు. అలా ఎవరైనా అనుకుంటే క్షమాపణలు చెబుతానని చెప్పారు. 'నేను తప్పు చేశానని అనుకోవడం లేదు. తప్పు చేశానని ఎవరైనా అనుకుంటే ఇప్పటికీ క్షమాపణ చెప్పేందుకు నేను సిద్ధమే' అని అన్నారు.గాంధీ కుటుంబం, కాంగ్రెస్‌పై తనకు తిరుగులేని నిబద్ధత ఉందని, తన నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరని డీకే స్పష్టం చేశారు. 'గాంధీ కుటుంబం నాకు దైవం. కాంగ్రెస్ వ్యక్తిగానే పుట్టాను. కాంగ్రెస్ వ్యక్తిగానే




మరణిస్తాను' అని చెప్పారు. పార్టీలకు అతీతంగా తనకు ఎందరో మిత్రులు, అనుచరులు ఉన్నారని, అందరి మనోభావాలను గౌరవిస్తానని తెలిపారు. తాను ఎవరికన్నా పెద్ద కాదని, కష్ట సమయంలో ఎవరున్నా వారికి అండగా నిలబడేందుకు తాను జీవితాంతం కట్టుబడి ఉంటానని చెప్పారు.అసలేం జరిగిందిచిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటపై ఆగస్టు 21న అసెంబ్లీలో జరిగిన చర్చలో డీకే పాల్గొంటూ, ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతం 'నమస్తే సదా వత్సలే మాతృభుమే'లోని రెండు లైన్స్ ఆలపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంభవించిన తొక్కిసలాట ఘటన వివరాలు తనవద్ద ఉన్నాయని చెబుతూ... ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. దీనిపై బీజేపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ దీనిపై స్పందించారు. ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రార్థనా గీతం ఆలపించి ఉంటే.. ఈ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌తో సహా అందరికీ చెందినది కాబట్టి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆయన గీతం ఆలపించి ఉంటే ఆయన క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని అన్నారు.

# జపాన్‌లో పర్యటించనున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** రెండు రోజుల పాటు జపాన్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. విదేశాంగ శాఖ ప్రతినిధి విక్రమ్ మిశ్రీ ఈ విషయాన్ని ఇవాళ వెల్లడించారు. ఆగస్టు 29వ తేదీన మోదీ జపాన్ వెళ్లనున్నట్లు ఆ శాఖ పేర్కొన్నది. జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో ఆయన మాట్లాడుతారు. 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు 8 సార్లు జపాన్‌కు వెళ్లారు. రెండు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జపాన్ నుంచి ఆయన నేరుగా చైనాకు వెళ్తారు.విదేశాంగ శాఖ కార్యదర్శి మీడియాతో మిశ్రీ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరగనున్నట్లు చెప్పారు. ఆ మీటింగ్‌లకు చెందిన అంశాలను ఫైనలైజ్ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై అప్‌డేట్స్ ఇస్తామన్నారు. భారత్, జపాన్‌కు క్వాడ్ గ్రూపు దేశాలు కీలకమైనవన్నారు. జపాన్‌లో పర్యటన ముగిసన తర్వాత చైనీస్ పోర్టు నగరం తియాంజిన్‌కు మోదీ వెళ్తారు. అక్కడ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు జరిగే షాంఘై సహకార సంస్థ మీటింగ్‌కు హాజరవుతారు.

# పదవులపై ఉన్న శ్రద్ధ. ప్రాజెక్టులపై లేదు

**- టీబీ డ్యాం భద్రత మరిచిన సిద్ధరామయ్య ప్రభుత్వం**

**- ప్రతిపక్ష నాయకుడు అశోక్ మండిపాటు**

**బళ్లారి(బెంగళూరు):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయాలపై, పదవులను కాపాడుకోవడంపై ఉన్న ఆసక్తి రైతులపై కానీ, ప్రాజెక్టులపై కానీ లేదని ప్రతిపక్షనాయకులు అశోక్ మండిపడ్డారు. సోమవారం తుంగభద్ర డ్యామ్‌ను బీజేపీ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అశోక్ మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్ధరామయ్యకు పదవిని కాపాడుకునేందుకే సమయం సరిపోలేదని, రైతుల బాగోగులు మరిచే పోయారన్నారు.దీనికి ప్రధాన ఉదాహరణ టీబీ డ్యాం పరిస్థితేనన్నారు. గతేడాది క్రస్ట్‌గేటు కొట్టుకుపోయి రైతులు ఎంతో ఆందోళనకు గురయ్యారని, ప్రభుత్వం అప్పుడు హడావుడి చేసిందే కానీ తర్వాత డ్యామ్ భద్రతపై దృష్టి పెట్టింది లేదన్నారు. ఎందరో రైతులకు జీవనాడి అయిన తుంగభద్రను విస్మరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని గేట్లను మార్చి డ్యామ్‌ను కాపాడాలన్నారు.నవంబర్‌లో రాష్ట్ర రాజకీయాలు మారనున్నాయని, సీఎం దిగిపోవచ్చన్నారు. పదవులు కాపాడుకునేందుకు అధికార పార్టీ నాయకులు



తాపత్రపడుతున్నారే కానీ తుంగభద్ర డ్యాం గురించి, రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. తుంగభద్ర డ్యాం భద్రతపై దృష్టి పెట్టకపోతే కర్నాటక, ఆంధ్ర రెండు రాష్ట్రాల రైతులూ నష్టపోక తప్పదన్నారు. ఇప్పటికి అధికారుల లెక్కల ప్రకారం 140 టీఎంసీల నీరు నదికి వెళ్లాయని, దీని వల్ల ఎవరికి నష్టం అని అన్నారు.హిందూ దేవాలయాలపై కాంగ్రెస్ కుట్ ధర్మస్థల అంశంపై కాంగ్రెస్ వాళ్లు కావాలనే గొడవ సృష్టిస్తున్నారని, ఇది హిందూ దేవాలయాలపై కుట్రేనని ప్రతిపక్ష నేత అశోక్ అన్నారు. హొస్పేట్‌లో టీబీ డ్యాం పరిశీలించిన అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడుతూ హిందూ దేవాలయాలే లక్ష్యంగా ఇటీవల సోషల్ మీడియాలో కథనాలు సృష్టిస్తున్నారన్నారు. దీని వెనుక పెద్ద ముఠా పనిచేస్తోందన్నారు. మాస్క్ మ్యాన్ అనన్యభట్ వీరం తా పాత్రధారులు. ప్రభుత్వం ముసుగు వేసుకున్న వ్యక్తి వెనుక ఉంది.ప్రభుత్వమే అతనికి మద్దతు ఇస్తోందన్నారు. అనామకుడి మాట విని సిట్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ముసుగు వేసుకున్న వ్యక్తిని ముసుగు తీయమని తాను గతంలో రెండుసార్లు చెప్పాను. అతను ముసుగు తీసేసి ఉంటే అతను దొంగ అని తెలిసి ఉండేది. అతను మతం మారిన వ్యక్తి అని తెలిసింది. గ్రామం మొత్తం ముసుగు వేసుకున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్నారని అశోక్ అన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో రచ్చ చేస్తోందన్నారు.

# భారత్ శాంతిని కోరుకునే దేశం : సీడీఎస్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ:** భారత్ శాంతిని ప్రేమించే దేశమని, కానీ దాన్ని తప్పుగా భావిస్తే పరిణామాలు వేరేగా ఉంటాయని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. ఎల్లప్పుడూ శాంతివాదులు కాలేమని, అవసరమైనప్పుడల్లా తిరిగి దాడి చేయడానికి దేశం సంసిద్ధంగా ఉంటుందని చెప్పారు. 'మీరు శాంతిని కోరుకుంటే, యుద్ధానికి సిద్ధం' అనే లాటిన్ కోట్?ను ప్రస్తావించారు. ఈ మేరకు మధ్యప్రదేశ్?లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు.వేగంగా, నిర్ణయాత్మకంగా ఉండాలి! భారతదేశ సైనిక శక్తిని పెంపొందించడానికి సన్నాహాల్లో భాగంగా మూడు దళాల మధ్య ఎక్కువ సమన్వయం అవసరమని సీడీఎస్? నొక్కిచెప్పారు. భూమి, సముద్రం, గాలి, సైబర్, అంతరిక్షంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో మన ప్రతిస్పందన ఏకీకృతంగా, వేగంగా, నిర్ణయాత్మకంగా ఉండాలని అన్నారు. భవిష్యత్ యుద్ధభూమి సేవా సరిహద్దులను గుర్తించదని, దీనికి ఉమ్మడి ఆలోచన, ఉమ్మడి ప్రణాళిక అవసరమన్నారు.ఈ సెమినార్ శక్తిని ప్రదర్శించడం గురించి కాదు. భాగస్వామ్య కార్యాచరణ అవగాహనను రూపొందించడం గురించి. కలిసి పోరాడటానికి మాత్రమే కాకుండా కలిసి ఆలోచించడానికి కూడా మనం సిద్ధం కావాలి" అని ఆయన అన్నారు. రణ్ సంవాద్ సైనిక నిపుణులను వ్యూహాత్మక సంభాషణలో ముందుకు తీసుకువస్తుందని తెలిపారు. ఈ కొన్ని ఉమ్మడి సిద్ధాంతాలు, సాంకేతిక దృక్పథం, సామర్థ్య రోడ్‌మ్యాప్ విడుదలవుతుంది.


# ఆప్ మాజీ మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు



**ఢిల్లీ:** దిల్లీ మాజీ మంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆసుపత్రుల నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈడీ అధికారులు దిల్లీలోని భరద్వాజ్ ఇంటితో పాటు మరో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు నిర్వహించారు.ఈ కుంభకోణానికి సంబంధించి ఈ సోదాల్లో కీలక ఆధారాలు లభించే అవకాశం ఉందని ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులను ఈడీ ప్రశ్నించింది. గతంలో కూడా ఈ కేసు విషయంలో పలుమార్లు సోదాలు జరిగాయి. ఈసారి నేరుగా మాజీ మంత్రి నివాసంలోనే సోదాలు చేయడం ఈ కేసులో కీలక మలుపుగా పరిగణిస్తున్నారు. ఆప్ ప్రభుత్వంపై ఈ ఆరోపణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ కేసుపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు, సోదాలు జరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలు దిల్లీ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.


# అసోంలో తెలుగు వైబ్స్ 'ఆపరేషన్ సిందూర్' థీమ్‌తో 41 అడుగుల గణపయ్య

**అసోం:** అసోంలోని గువాహటి వినాయక చవితి సంబరాలకు సిద్ధమవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' థీమ్ తో 41 అడుగుల గణపయ్య కొలువుదీరనున్నాడు. ఈ విగ్రహాన్ని గువాహటిలో తెలుగు ప్రజలు పెడుతున్నారు. నగరంలోని ఫటాసిల్ అంబారీ వద్ద ఉన్న 41 అడుగుల ఎత్తైన ఈ గణేశ్ విగ్రహం ఈశాన్య ప్రాంతంలోనే అత్యంత ఎత్తైనదిగా నిలవనుంది. గత నాలుగు దశాబ్దాలుగా అసోం తెలుగు అసోసియేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూత్ క్లబ్?తో కలిసి గణేశ్ చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గువాహటిలో తెలుగువారు జరుపుకునే వినాయక చవితి వేడుకల ప్రత్యేకతలు ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ఉగ్రదాడి మృతులకు నివాళిగా స్పెషల్ థీమ్'ఆపరేషన్ సిందూర్' థీమ్?తో గువాహటిలో తెలుగువారు ఏర్పాటు చేయనున్న గణేశ్ విగ్రహాన్ని చూసేందుకు వేలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు భావిస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఇక్కడ తొలుత ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఇప్పుడు ఘనంగా జరుగుతున్నాయి. గణేశ్ మండపాల వద్ద తెలుగు కుటుంబాలు భక్తి పాటలతో భజనలు చేస్తారు. వివిధ వర్గాల ప్రజలు విఘ్నేషుడి మండపాన్ని చూసేందుకు తరలివస్తుంటారు. అసోంలో తెలుగువారి కుటుంబాల్లో జన్మించిన పిల్లలు తెలుగు భజన పాటలు పాడతారు. పెద్దలు హిందూ పురాణగాథల గురించి వారికి చెబుతారు.'స్వగ్రామానికి వెళ్లిన భావన' "తెలుగువాళ్లు ఆంధ్ర, తెలంగాణ నుంచి వందల మైళ్ల దూరం నుంచి వచ్చి గువాహటిలో నివసిస్తున్నారు. కానీ ప్రతి గణేశ్ చతుర్థికి తెలుగువారు ఒక దగ్గరకు చేరుకుంటారు. వారు స్వగ్రామానికి వెళ్లినట్లు హృదయాలు ఉప్పొంగిపోతాయి. మన కుటుంబాలతో కలిసి పూజలు చేస్తున్నట్లుగా అనిపిస్తుంది" అని అసోం తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.




శ్రీనివాసరావు తెలిపారు. గణేశ్ చతుర్థి కేవలం ఆచారాల గురించి మాత్రమే కాదన్నారు యువ మండల్ కార్యదర్శి చౌదరి గోవింద. ఇది జ్ఞాపకశక్తి, గుర్తింపు, కృతజ్ఞతకు సంబంధించినదిగా తెలిపారు. "తెలుగు కమ్యూనిటీకి చెందిన పిల్లలు పాఠశాలలో అస్సామీ మాట్లాడవచ్చు. కానీ వారు గణేశుడి ముందు నిలబడినప్పుడు వారు ఎవరో తెలుసుకుంటారు. గణేశుడు విఘ్నాలను తొలగించేవాడు. ఆయన పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారి ఆత్మకు శాంతి, వారి కుటుంబాలకు బలం చేకూర్చుతాడు" అని గోవింద అభిప్రాయపడ్డారు.ఆరు రోజులపాటు వేడుకలుఈ ఏడాది వినాయక చవితి వేడుకలు విభిన్నంగా జరగనున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ థీమ్?తో ఈ ఏడాది పండల్?ను ఏర్పాటు చేయనున్నారు. ఆరు రోజుల పాటు గణేషుడిని మండపంలో ఉంచి, ఆ తర్వాత నిమజ్జం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రూ. 14 లక్షల బడ్జెట్ ఉంది. ప్రతిరోజూ 10,000 మందికి పైగా భక్తులు ఈ వేదికను సందర్శిస్తారని నిర్వహకులు భావిస్తున్నారు.అసోంలో 2లక్షల మంది తెలుగువారుగువాహటిలో సుమారు 10,000 మంది తెలుగు ప్రజలు నివసిస్తున్నారని తెలుగు అసోసియేషన్ కార్యదర్శి కె. శ్రీనివాస్ రావు తెలిపారు. తెలుగు ప్రజలు ఫటాసిల్, భంగాగర్, నూన్మతి, బామునిమైదాం, బారువా రోడ్, మాలిగావ్, పాండు, ఉత్తర గువాహటిలో ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం మీద అసోం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మంది తెలుగు ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. 1960లలో తెలుగు ప్రజలు అసోంకు వలస రావడం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రధానంగా రైల్వేలు, ఆరోగ్య రంగం, గువాహటి మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాల కోసం ఇక్కడకి వచ్చారన్నారు. ఆ తర్వాత అనేక తెలుగు కుటుంబాలు ఇక్కడే శాశ్వత నివాసితులుగా మారిపోయానని వెల్లడించారు."నా చిన్నప్పుడు నా తండ్రి 1973లో గువాహటికి వచ్చారు. కాలక్రమేణా మేము దక్షిణాది సంప్రదాయాలను గౌరవించడమే కాకుండా అస్సామీ సంస్కృతిని పాటిస్తున్నాం. మేము అస్సామీ మాట్లాడుతాం. తెలుగును అర్థం చేసుకోగలం. అస్సాం వాసులు, మేము కలిసి ఒకరి పండుగలను ఒకరు జరుపుకుంటాం. మా మధ్య పరస్పర ప్రేమ, సహకారం ఉంది" అని శ్రీనివాసరావు చెప్పారు.తెలుగు ప్రజలకు గణేశ్ చతుర్థి ఒక ఎమోషనల్ గువాహటిలో నివసించే తెలుగు సమాజానికి, గణేశ్ చతుర్థి కేవలం ఒక పండుగ కంటే ఎక్కువ. ఇది జ్ఞాపకాల గుండె చప్పుడు. తమ మూలాల ఉన్నవారిని కలుసుకునేందుకు అరుదైన వేదిక. "మాకు హిందూ విశ్వాసాలపై అపారమైన నమ్మకం. గణేశ్ చతుర్థినాడు భారీ గణేశ విగ్రహాన్ని చూసినప్పుడు అస్సామీ స్నేహితులు మాతో కలిసి గణపతి బప్పా మోరియా అని నినదిస్తారు" అని తెలుగు సమాజానికి చెందిన ఓ వ్యక్తి తెలిపారు.

# ముంబైలో గణేశ్ చతుర్థి సందడి ఆకట్టుకుంటున్న గణనాథులు మీరూ ఓ లుక్కేయండి.



**ముంబై ఆగస్టు 27.** గణేశ్ చతుర్థి. ఈ సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు యావత్ దేశం సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రధాన నగరాల్లో 'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై..' అంటూ నినాదాలు మార్మోగిపోతున్నాయి. విభిన్న ఆకృతుల్లో కొలువుదీరే వినాయకుల కోసం మండపాలు కూడా సిద్ధమవుతున్నాయి. కొన్నిచోట్ల ఖరీదైన గణేశ్ మూర్తులను ఏర్పాటు చేస్తుండగా.. మరికొన్ని చోట్ల భారీ సెట్టింగ్‌లతో తాత్కాలిక మండపాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారన్న విషయం తెలిసిందే. అక్కడ కొలువుదీరే గణనాథులు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఆ గణనాథులను మీరూ చూసేయండి మరి..లాల్ బాగ్చా రాజా..ముంబైలో గణేశ్ చతుర్థి అంటే ముందుగా గుర్తొచ్చేది 'లాల్ బాగ్చా రాజా' గణనాథుడు. హైదరాబాద్‌లో ఖైరతాబాద్ మహా గణపతి ఎంత ఫేమస్సో ముంబై వాసులకు ఈ గణనాథుడు అంత ఫేమస్. 1934 నుంచి లాల్‌బాగ్చా మార్కెట్‌లో కొలువుదీరే ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. సినీ సెలబ్రిటీల నుంచి రాజకీయ నాయకుల వరకూ ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఈ గణనాథుడిని ఈ ఏడాది కూడా 'లాల్ బాగ్చా రాజా' పూజలకు సిద్ధమయ్యారు.


# చంద్రబాబు నుంచి రేఖా గుప్తా సీఎంలపై జరిగిన దాడులు

**ఢిల్లీ:** దిల్లీ సీఎం రేఖా గుప్తా సివిల్ లైన్స్‌లోని తన అధికారిక నివాసంలో 'జన్ సున్ వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై ఇటీవలే దాడి జరగడం తీవ్ర కలకలం రేపింది. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు ముఖ్యమంత్రికి పత్రాలను అందిస్తూ ఆమెపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. అలాగే సీఎంను చెంపదెబ్బ కొట్టి, ఆమెను వెనక్కి తోసేయడానికి యత్నించాడు. తక్షణమే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకొని నిందితుడిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ క్రమంలో కట్టుదిట్టంగా భద్రత ఉండే ఈ ముఖ్యమంత్రిపై దాడి జరగడం ఇదే మొదటిసారినా? దేశంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రులపై జరిగిన దాడులు ఎన్ని? ఎవరెవరిపైఅటాక్ జరిగింది? ఆ విషయాలు తెలుసుకుందాం.కేజ్రీకి చెంపదెబ్బ2019 ఏప్రిల్ 5న దిల్లీ అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్?పై దాడి జరిగింది. న్యూదిల్లీలోని మోతీ నగర్‌లో ఓపెన్ టాప్ జీపులో రోడ్ షో చేస్తుండగా ఓ దుండగుడు వచ్చి అరవింద్ కేజ్రీవాల్‌ను చెంపదెబ్బ కొట్టాడు. దీంతో ముఖ్యమంత్రి బ్యాలెన్స్ కోల్పోయారు. జీపు నుంచి కింద పడిపోతుండగా మద్దతుదారులు ఆయనను పట్టుకున్నారు. ఈ దాడిలో



నిందితుడుని సురేశ్ (33)ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు కైలాశ్ పార్క్‌లో విడిభాగాల వ్యాపారి అని గుర్తించారు.సీఎం ముఖంపై కారం2018 నవంబరు 20న కేజ్రీవాల్?పై దాడి జరిగింది. అనిల్ శర్మ అనే వ్యక్తి దిల్లీ ముఖ్యమంత్రికి ఒక లేఖ అందజేశాడు. ఆ తర్వాత ఆప్ అధినేత పాదాలను తాకడానికి కిందికి వంగాడు. ఆపై వెంటనే తన వెంట తెచ్చుకున్న కారం పొడిని కేజ్రీ ముఖం విసిరాడు. వెంటనే నిందితుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన దిల్లీ సచివాలయం లోపల జరిగింది.సీఎంపై షూ విసిరిన వ్యక్తి 2016 ఏప్రిల్ 9వ తేదీన దిల్లీలో ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా సరి-బేసి పథకాన్ని తిరిగి ప్రవేశపెడుతున్నట్లు మీడియా సమావేశంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఆ సమయంలో దిల్లీ ముఖ్యమంత్రిపై వేద్ ప్రకాశ్ అనే వ్యక్తి షూ విసిరాడు. వెంటనే పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టారు.కేజ్రీవాల్ కారుపై దాడి016 ఫిబ్రవరి 29న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్?పై దాడి జరిగింది. పంజాబ్?లోని లూథియానాలో కేజ్రీవాల్ కారుపై ఇనుప రాడ్లు, కర్రలతో కొందరు దాడి చేశారు.కేజ్రీపై సిరా దాడి2016 జనవరి 17న కేజ్రీవాల్?పై భావన ఆరోరా అనే మహిళ సిరా చల్లి నిరసన తెలియజేసింది. దిల్లీలో ఛత్రసల్ స్టేడియంలో సరి-బేసి వాహన విధానం విజయవంతం ప్రజలకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో సీఎం ప్రసంగిస్తుండగా, వేదికకు దగ్గరగా వెళ్లిన భావనపై సిరాతో దాడి చేసింది. ఈ దాడి బీజేపీ కుట్రలో భాగమని ఆప్ అప్పట్లో విమర్శించింది.

# ట్రంప్ కుడిచేతిపై మిస్టీరియస్ మార్క్



**అమెరికా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే పలు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆయన చేతులపై కమిలిన గాయాలు కనిపించడం ఇటీవలే కలకలం రేపుతోంది. తాజాగా ట్రంప్ కుడిచేతి వెనుక భాగంలో ఓ తెల్లటి మార్క్ కనిపించింది. సోమవారం ఓవెల్ ఆఫీస్ లో జరిగిన సమావేశం సందర్భంగా అది కెమెరాకు చిక్కింది. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన రేకెత్తించింది. ఇది చూసిన ట్రంప్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ వింత వ్యాధితో బాధపడుతున్నారంటూ వదంతులు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇటీవలే కనిపించాయి. ఆ తర్వాత న్యూజెర్సీలో జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ తిలకించేందుకు వచ్చిన ట్రంప్ కాస్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపించారు. కాళ్ల వద్ద నరాలు ఉబ్బిపోయినట్లుగా, కుడి చేతిపై పలు చోట్ల వాపు ఉన్నట్లు కెమెరా కంట పడింది. ఇప్పుడు మరోసారి ట్రంప్ కుడి అరచేతి వెనుక ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆ కమిలిన గాయాన్ని దాచేందుకు అధ్యక్షుడు మేకప్‌తో కవర్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ప్రకృతి ప్రేమే...వినాయక పూజ !

భారతీయ సాంప్రదాయాలు, పండగలు అన్నీకూడా ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ప్రకృతిని ఆరాధించడం మనజీవితంలో నిత్యకృత్యం. ప్రకృతితో ముడిపడి ఉన్న పంచభూతాలను ఆరాధించడం వేదకాలం నుంచే ఉంది. మట్టితో గణపతులను చేయడం, పూలూపత్రి పెట్టడం, అవన్నీ చెరువులో వేయడం వెనక ప్రకృతి పరమార్థం దాగివుంది. మన పండగలన్నీ ప్రకృతి ఆరాధనతో మమేకమై వుంటాయి. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. వినాయక పూజలో ఉపయోగించే పత్రిలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. గోరంత పత్రి పెడితే చాలు కొండంత వరాలు గుప్పిస్తాడు. అందుకే వినాయక పూజ అంటే అందరికీ ఇష్టం. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతికి పాటుపడేలా చేయాలి. ఉండ్రాళ్ళ నైవేద్యానికే మహదానంద పడిపోతాడు విఘ్నేశ్వరుడు. ఒక్క వినాయకుడికే పత్రిపూజ ఎందుకు చేస్తాం ఎందుకంటే ఆయన గజముఖుడు కదా! ఏనుగుకు ఇష్టమైనవి ఆకులే కదా! అందుకే ఈ పత్రి పూజ. ఏకవింశతి... అంటే ఇరవైఒక్క రకాల పత్రితో గణేశుణ్ణి పూజిస్తాం. గజాననుడని కీర్తించినా, మూషిక వాహనుడని మొక్కినా, సర్వవిఘ్నాలకు అధినాయకుడని శిరస్సు వంచినా తొలిపూజలు దక్కేదతనికే. అందుకే భాద్రపద శుక్ల చవితి రోజున భక్తి శ్రద్ధలతో వినాయక పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం! అయితే ప్రకృతిని ఆరాధిస్తున్న మనం..దాని విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు. ప్రకృతి పరిరక్షణ చర్యలను పెద్దగా గుర్తించడం లేదు. దీనినుంచి బయటపడే మార్గాలను ఆలోచించాలి. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను జరుపుకొంటాం. గణపతి అంటే ప్రకృతి ప్రియుడు. ఆయనకు మనం చేసే పూజ అంతా ప్రకృతి ఆరాధన కిందకే వస్తుంది. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత



ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్య రహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. మనం పూజించే మారేడు, ఉత్తరేణి వంటివి ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల వీటిని కాలుష్యం నుంచి కాపాడుతాయి. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటుచేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. ఇవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేలా చూడాలి. అలాగే ప్రకృతి పరిరక్షణ ద్వారా పండగల పరమార్థం తెలుసుకోవాలి. గణపతి నవరాత్రుల కోసం ఖర్చు చేసే మొత్తాన్ని ప్రకృతి పరిరక్షణకు ఉపయో గిస్తే కరోనా లాంటి వైరస్‌లు మనలను ఏమీ చేయలేవు. వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. నేత్ర, మూత్ర, చర్మ సంబంధమైన రోగాలతోపాటు మరికొన్ని ఇతర వ్యాధులకు మంచి మందుగా పనిచేస్తుందీ పత్రి. అంతేకాక ఆ పత్రి నుంచి వెలువడే సుగంధాన్ని పీల్చడం వల్ల కూడా స్వస్థత చేకూరుతుంది. పత్రిని మనం చేత్తో ముట్టుకోవడం వల్ల అందులో ఉండే వృక్ష సంబంధ రసాయన పదార్థాలు కావలసిన మోతాదులో చర్మం ద్వారా మన శరీరం లోకి శోషణం చెంది ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తొమ్మిది రోజుల తర్వాత వినాయకుణ్ణి బావుల్లో, నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఇలా ఎందుకు చేయడం అంటే కలుషితమైన ఆ నీటిని శుభ్రం చేయడానికి ఈ 21 పత్రాలు ఉపయోగపడతాయట. అందుకే తొమ్మిది రోజుల పూజ తర్వాత విగ్రహంతో పాటు ఆకులను కూడా నీళ్లలో వదిలేసి వస్తారు. ఇవి ఇరవైమూడు గంటలయ్యాక తమలో ఉన్న ఔషధగుణాల ఆల్కలాయిడ్స్‌ని నీళ్లలోకి వదిలేస్తాయి. దాని వల్ల నీటిలో ఉండే బాక్టీరియా నిర్మూలన జరిగి నీళ్లల్లో ఆక్సిజన శాతం పెరుగుతుంది. వినాయక పూజ వల్ల మనకు విఘ్నాలు తొలగి అనుకున్న పనులన్నీ చక్కగా జరుగుతాయి. పిల్లలకు పత్రి సేకరణ వల్ల వృక్ష విజ్ఞానంతో పాటు వినోదం, పర్యావరణం పట్ల స్నేహభావం కలుగుతాయి. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా, చెరువు నీరు కాలుష్యరహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటు చేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతిఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. వీటిని మట్టితో తయారుచేస్తేనే మన పర్యావరణం కాపాడకున్నవారం అవుతాం. ఇటీవల కొంతకాలంగా విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్యారిస్, రసాయనాలు కలిగిన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక నిమజ్జనంతో ఈ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులు, కుంటలు, తటాకాలు, బావులు, నదులకు పర్యావరణ నష్టం జరుగుతోంది. ఈ జలాల్లో నివసించే అనేక జీవకోటి మనుగడకు విఘాతం ఏర్పడుతోంది. అలాగే నీరు కలుషితం అవుతోంది. దీంతో మళ్లీ ఇది వాడడానికి వీలు లేకుండా హైదారాబాద్ హుస్సేన్ సాగర్‌లా కాలుష్య కాసారంగా మారుతున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. మట్టి గణపతు లను తయారుచేయడం ద్వారా కొంతయినా పర్యావరణం కాపాడు కోగలం. ఇంట్లో పూజించే చిన్న చిన్న వినాయక విగ్రహాలను పూర్తిగా మట్టితో తయారుచేస్తే అవి పర్యావరణహితంగా వుంటా యి. నీటిలో సులభంగా కరిగిపోతాయి. ఎలాంటి రంగులను వాడకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉండదు. ఇక వీధుల్లో ప్రతిష్టించే పెద్ద విగ్రహాల తయారీలోనూ మట్టినీ, పర్యావ రణ హితమైన రంగుల్నీ వాడటం ద్వారా పర్యావరణానికి మేలు చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి విగ్రహాల వల్ల నిమజ్జన సమయంలో జలాలు కలుషితం కావని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఈ వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా స్వచ్ఛమైన ప్రకృతి కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. పెద్ద పెద్ద చెరువులూ, తటాకాలూ, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసి పర్యావరణానాన్ని దెబ్బతీయకుండా చేస్తే అంతకు మించిన పర్యావరణపరిరక్షణ మరోటి ఉండదు.


# గాజాలో మానవ కల్పిత క్షామం



లేని కరవును సృష్టించి గాజాను నాశనం చేస్తున్న ఇజ్రాయెల్ దుర్మార్గాన్ని నివారించడానికి ప్రపంచ దేశాలు గట్టిగా ప్రయత్నించక తప్పదు. కొన్ని నెలలుగా గాజాలో సహాయ కార్యక్రమాలు సాగిస్తున్న అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, సహాయ సంస్థలు, డాక్టర్లు గాజా తీవ్ర దుర్భిక్షం అంచుల్లో ఉందని హెచ్చరిస్తున్నాయి. గాజాలో తిండిలేక ప్రతిరోజూ అనేక వందలాది మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నా, గాజాలో తాండవిస్తున్న తీవ్రకరవు, కాటకాలకు సంబంధించిన హృదయ విదారక కథనాలను పదేపదే ప్రపంచ దేశాలకు గాజా పౌర రక్షణ బృందాలు చాటి చెబుతున్నా ఇజ్రాయెల్ మాత్రం గత 22 నెలలుగా జాతి విధ్వంసక యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ కథనాలన్నీ కేవలం కట్టుకథలుగా తోసిపుచ్చుతోంది. ఇజ్రాయెల్ మిత్ర దేశాలు నామమాత్రపు ఆందోళన వ్యక్తం చేయడం తప్ప మరేమీ చేయడం లేదు. గతవారం ఐక్యరాజ్యసమితి మద్దతు గల ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేస్ క్లాసిఫికేషన్(ఐపిసి) గాజా నగరంలోను, పరిసర ప్రాంతాల్లోనూ మానవ కల్పిత క్షామం తాండవిస్తోందని అధికారికంగా నిర్ధారించింది. పశ్చిమాసియాలో ఇటువంటి పరిస్థితి రావడం ఇదే మొదటిసారి. ఇక్కడ 5 లక్షల మందికి పైగా ఘోరమైన ఆకలితో అలమటిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి నిపుణులు చెప్పారు. ప్రతి ఐదు కుటుంబాల్లో కనీసం ఒక కుటుంబమైనా తీవ్ర ఆహార కొరతలను ఎదుర్కొంటోందని, అలాగే పిల్లల్లో ప్రతి మూడో పిల్లవాడు లేదా అంతకన్న ఎక్కువ మంది తిండిలేక అలమటిస్తున్నారని ఐపిసి వెల్లడించింది. రోజూ ప్రతి పదివేల మందిలో కనీసం ఇద్దరైనా తిండిలేక దాపురించే రోగాలతో ప్రాణాలు కోల్పోతున్నారని వివరించింది. ఇజ్రాయెల్ ఒక పద్ధతి ప్రకారం అడ్డంకులు సృష్టిస్తున్నందువల్లే పాలస్తీనా భూభాగంలోకి ఆహారం వెళ్లడం లేదని యుఎన్ ఎయిడ్ చీఫ్ ఫ్లెచర్ స్పష్టం చేయడం గమనార్హం. ప్రఖ్యాత సంస్థ ఏదైనా అలాంటి విధ్వంసక నివేదికను వెల్లడిస్తే రణదాహంతో అల్లాడుతున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ప్రభావం చూపిస్తుందని, అతని హృదయాన్ని ద్రవింప చేస్తుందని భావించడం పొరపాటే అవుతుంది. ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ గాజా సిటీలో ఎలాంటి కరవు లేదని వాదిస్తోంది. యుఎన్ నివేదిక హమాస్ ఉగ్రవాద సంస్థ చెప్పిన అబద్ధాల ఆధారంగా తయారు చేసిందని మండిపడింది. 2007 నుంచి ఇజ్రాయెల్ ముట్టడిలో ఉన్న గాజాలో నిత్యావసరాలు, మరే వస్తువులు ప్రవేశించకుండా ఇజ్రాయెల్ సుదీర్ఘకాలంగా ఆంక్షలు విధించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసిన తరువాత ఆ ఆంక్షలను మరీ కఠినతరం చేసింది. యుద్ధ విరమణ ఒప్పందాన్ని నెతన్యాహు ఉల్లంఘించిన తరువాత 2025 మార్చి 25 న గాజాలో ఎలాంటి నిత్యావసరాలు లేదా వస్తువులు ప్రవేశించకుండా మూడు నెలల పాటు ఇజ్రాయెల్ దిగ్బంధించింది. ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ఇదివరకు నిర్వహించిన ఆహార పంపిణీ వ్యవస్థకు బదులుగా అమెరికా ఇజ్రాయెల్ సాయంతో ఏర్పాటైన గాజా హ్యూమనిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) అనే కొత్త సంస్థ ఏర్పాటైన తరువాత పరిమితంగా ఆహారాన్ని అందించడం జరుగుతోంది. దిగ్బంధంతోపాటు ఆహార పంపిణీపై ఇజ్రాయెల్ నియంత్రణ ఉండడంతో వేలాది మంది ఆకలి మంటలకు బలైపోతున్నారు. జిహెచ్‌ఎఫ్ కొద్దిగా ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాలకు అన్నార్తులైన పాలస్తీనియన్లు పరుగులు తీస్తుండడం, రద్దీని అదుపు చేయడానికి అన్న సాకున వారిపై ఇజ్రాయెల్ దళాలు, జిహెచ్‌ఎఫ్ వాలంటీర్లు కాల్పులు జరపడం నిత్యకృత్యమైపోతోంది. గత మే నెల నుంచి 1300 కన్నా ఎక్కువమంది పాలస్తీనియన్లు ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నా, తాజాగా కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ అంగీకరించిందని ఖతార్, ఈజిప్టు దేశాలు ముందుకు తీసుకు వచ్చినా, కొత్తగా మళ్లీ నేరాలకు పాల్పడడానికి సిద్ధమవుతున్న రీతిలో గాజా సిటీని పూర్తిగా ఆక్రమించుకోడానికే ఇజ్రాయెల్ దాడులను ముమ్మరం చేస్తోంది. గాజా నగరానికి ఉత్తరాన ఉన్న జబాలియాలోని శరణార్థుల శిబిరాలపై ఆదివారం రాత్రంతా దాడులు కొనసాగాయి. వైమానిక దాడులతోపాటు, ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గడిచిన 24 గంటల్లో 64 మంది మృతి చెందగా, 300 మంది గాయపడ్డారు. గాజా సిటీలోని నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులతోపాటు కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023 అక్టోబర్ 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటివరకు 62 వేల మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. లక్షలాది మంది గాయపడ్డారు. 200 మందికిపైగా మీడియా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. గాజా సిటీ లక్షంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వ్ దళాలను రంగం లోకి దింపింది. మొత్తం గాజా స్ట్రిప్‌ను తన ఆధీనం లోకి తెచ్చుకోవాలన్న రణకాంక్షతో ఇజ్రాయెల్ పేట్రేగిపోతోంది. హమాస్‌ను ఓడించి, బందీలను విడిపించేవరకు తాము నిద్రపోయేది లేదని ఇజ్రాయెల్ చెబుతోంది. గాజాలో పాలస్తీనియన్ల జీవితాలను, సమాజాన్ని నామరూపాలు లేకుండా తుడిచిపెట్టేయాలన్నదే తన ఏకైక లక్షం. రణకాంక్షతో ఇజ్రాయెల్ పేట్రేగిపోతోంది. ప్రపంచ దేశాల సాక్షిగా 2.3 మిలియన్ ప్రజలకు వ్యతిరేకంగా అత్యంత క్రూరమైన నేరాలు సాగుతున్నాయి. ఇకనైనా ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్ దురాగతాలను కొనసాగనీయకుండా నివారించే ప్రయత్రం చేయక తప్పదు.

# ఆధునిక బానిసత్వం అమానవీయం

‘నేను వెయ్యి మంది బానిసలకు విముక్తి కల్పించాను. వారు బానిసలని తెలిస్తే నేను ఇంకా ఎక్కువమందిని విడిపించగలిగే వాడిని’ అని బానిసత్వం నిర్మూలనవాది హ్యారియెట్ టబ్ మాన్ అన్నారు. ఆమె మాటలు ఓ చేదు వాస్తవాన్ని బయటపెడు తున్నాయి. బానిసత్వం చట్టం చేసినంత మాత్రాన అంతరించి పోదు. అజ్ఞానం, భయం, బలహీనత ఉన్న చోట అది కొనసాగుతూనే ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు చట్టబద్ధంగా రద్దు చేసినప్పటికీ, బానిసత్వం మరో రూపంలో వృద్ధి పొందుతూనే ఉంది. వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, వలస కార్మికుల నిర్బంధ పని, దుర్వినియోగం రూపంలో సాగుతోంది. ఈ సంకెళ్లు ఇనుప సంకెళ్లు కాకపోవచ్చు. కానీ లక్షలాదిమందిని అలాగే కఠినంగా బంధిస్తున్నాయి. బానిసత్వం గత చరిత్ర అని నమ్మడంలో ప్రమాదకరమైన ఆత్మసంతృప్తి ఉంటుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఐదు కోట్లమంది ఆధునిక బానిసత్వంలో బలవంతపు శ్రమలోనో, బలవంతపు వివాహ వ్యవస్థలోనో చిక్కుకున్నారు. ఈ సంఖ్యే మన భ్రమలను కూపృకూలుస్తోంది. బానిసత్వం కేవలం పేరు మారింది. కాంట్రాక్టర్లు దీనిని ఉపాధి అంటారు. అక్రమ రవాణాదారులు దీనిని వలస అవకాశాలు అని వ్యవహరిస్తారు. ప్రభుత్వాలు దీనిని అక్రమ చొరబాటుదారులుగా ముద్ర వేస్తాయి. అయినా ప్రాథమికంగా అదే పాత పద్ధతి. గౌరవం ఉండదు, ఎన్నుకునే వీలు ఉండదు, బలవంతంగా సేవ చేయక తప్పదు. ‘జ్ఞానం మనిషిని బానిసగా ఉండడానికి అనర్హుడిని చేస్తుంది’ అని బానిసత్వం నిర్మూలనవాది ఫ్రెడరిక్ డగ్లస్ హెచ్చరించాడు. అయినా నేడు లక్షలాదిమంది కార్మికులకు తమ బానిసత్వాన్ని ప్రశ్నించే జ్ఞానం కానీ, ధైర్యం కానీ లేదు. ముఖ్యంగా వలస కార్మికులు సులక్షంగా చిక్కుతారు. వారికి స్థానిక భాష మాట్లాడడం రాదు. చట్టాలు తెలియవు, మనుగడ సాగించాలంటే పని చేయాల్సిందే. యజమానులు, దళారులు ఈ బలహీనతను ఉపయోగించుకుని వారి జీవితాలను చీప్ లేబర్‌గా ఉపయోగించుకుంటున్నారు. మరో దారుణం ఏమిటం ప్రజాస్వామ్యం, మానవహక్కులు, ప్రపంచ పాలన గురించి గొప్పలు చెప్పుకునే ప్రపంచంలో బానిసత్వం సజీవంగా ఉంది.



స్పష్టంగా కన్పించకపోయినా మరుగున దాగి ఉంది. భారతదేశం ఈ హిపోక్రసీకి అతీతం కాదు. బెంగాలీ మాట్లాడే వలస కార్మికుల దుస్థితి ఇందుకు ఉదాహరణ. వారు పశ్చిమబెంగాల్, అసోం పౌరులైనా, బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన శరణార్థులైనా దాదాపు బంగ్లాదేశ్ చొరబాటుదారులనే ముద్ర వేసేస్తున్నారు. ఈ కార్మికులు వివక్షకు గురవుతున్నారు. వారిని బయటి వ్యక్తులు అని పిలుస్తూ, సమాజం వారి దోపిడీని సమర్థిస్తోంది. ఆ ముద్రపడిన తర్వాత ఈ కార్మికులు, మురికి పనులు, అత్యంత ప్రమాదకరమైన ఉద్యోగాల్లో బలవంతంగా నెట్టివేయబడతారు. భద్రతా పరికరాలు ఉండవు, మురుగునీరు శుభ్రపరచడం, కాంట్రాక్టులు లేకుండానే నిర్మాణ కార్మికులుగా, పెద్దగా వేతనాలు, గౌరవం లేని పని మనుషులుగా పని చేస్తున్నారు. చాలా మందిని ముందే అప్పురూపంలో డబ్బు చెల్లించి బలవంతంగా పనుల్లో చేర్చుకుంటారు. అప్పులు తీరవు, తిరిగి చెల్లించలేరు. అప్పులు పెరిగిపోతూనే ఉంటాయి. నిర్మొహమాటంగా మాట్లాడితే ఇది బానిసత్వం. కార్మికులకు గౌరవం లేకుండా, బలవంతంగా పని చేయించడం, చట్టపరమైన రక్షణ నిరాకరించడం, దీనిని వలసదోపిడీ అని తోసిపుచ్చడం దారుణం. భారతదేశంలో రోహింగ్యాలు, బంగ్లా శరణార్థుల పట్ల వ్యవహిస్తున్న తీరు ఇంకా దారుణం. వారికి దేశం లేదు. ఎదురించే సత్తా, నోరు లేదు. చెత్త ఎరుకోవడం వంటి దిగజారుడు పనులలోకి వారిని నెట్టివేస్తున్నారు. వారి విలువను, వారు ఆర్థిక వ్యవస్థకు చేసే ప్రయోజనంతోనే బేరీజు వేస్తారు. ప్రజాస్వామ్య విలువల గురించి గొప్పగా చెప్పుకునే భారతదేశం ఈ వైరుధ్యాన్ని తప్పించుకోలేదు. మానవహక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉంది. ప్రపంచంలో ఇతర దేశాలను వేలెత్తి చూపించే ముందు యూరప్ తన మనస్సాక్షిని స్వయంగా పరీక్షించుకోవాలి. సిరియా, లెబనాన్, అఫ్ఘానిస్తాన్‌ల నుంచి యుద్ధ సమయంలో పారిపోయిన శరణార్థులు భద్రతకోసం యూరప్ చేరుతున్నారు. కానీ, కొత్త సంకెళ్లలో చిక్కుకుంటున్నారు. ఇటలీలో సిరియనా వలసదారులు తక్కువ జీతాలకు పంటలు పండిస్తారు.

## ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో యూరియా కోరత కొరకు ధర్నా



**మరిపెడ :**మహ బూబాబాద్ జిల్లా మరిపెడ మండల, మున్సిపాలిటీ కేంద్రం లో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో యూరియా కోరత కొరకు ధర్నా నిర్వహించిన సందర్భంగా ప్రసంగిస్తున్న. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ గుడిపూడి నవీన్ రావు కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మితే మోసపోతం.ఘోషపడుతాం అని కేసీఆర్ అప్పుడే చెప్పిండు.అలవికాని హామీలను నమ్మి కాంగ్రెస్ కు ఓటు వేసి మోసపోయిన ప్రజలు.ఇప్పుడు ఘోష పడుతున్నారు.ముందుచూపు లేని. వ్యవసాయం గురించి, రైతుల అవసరాల గురించి పట్టింపులేని రాష్ట్రప్రభుత్వ పాలన మూలంగానే యూరియాబస్తాల కోసం రైతన్న ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందినువ్వు తెస్తానన్న మార్పు అంటే ఇదేనా రేవంత్ రెడ్డి. ఇచ్చిన హామీలు నెరవేర్చవు, పచ్చని తెలంగాణను యూరియా కూడా దొరకని తెలంగాణ చేసావు.అప్పుడెట్లుండే తెలంగాణ.నీ.పాలనలో ఏమైంది తెలంగాణ.ఈ కార్యక్రమంలో డిఎస్ రవిచంద్ర , కుడితి మహేందర్ రెడ్డి గుగులోతు వెంకన్న గుగులోతు రాంబాబు తేజావత్ రవీందర్ , బాల్ని మాణిక్యం ,గాదె అశోక్ రెడ్డి ,నామ సైదులు వల్లూరి చెన్నారెడ్డి , డిఎస్ రాంసింగ్ బంటు ఉపేందర్ దుండి మురళి , తదితరులు పాల్గొన్నారు..

## మిడ్జిల్ హై స్కూల్ లో యస్.జి.యఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు




**మిడ్జిల్ ,:**మిడ్జిల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తేదీ. 29 ఆగష్టు 2025 న యస్ జి యఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలలో బాల బాలికలు (అండర్ 14, అండర్ 17) లకు శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగనున్నాయి. ఈ అవకాశాన్ని క్రీడలపై ఆసక్తి గల విద్యార్థిని ,విద్యార్థులు వినియోగించుకోగలరని ఒక ప్రకటనలో స్కూల్ జి.హెచ్.ఎం సరస్వతి తెలిపారు. ఈ నిర్వహణలో పిడి జి.రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొననున్నారు.

## పర్యావరణాన్ని కాపాడదాం

**పంచభూతాలను ప్రకృతిని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ పెన్నులకు చెక్ పెడదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం**




**నారాయణపేట జిల్లా :** నర్వ మండలంలో మొట్టమొదటిసారిగా ప్లాస్టిక్ పెన్నులకు బదులుగా పర్యావరణాన్ని కాపాడే పేపర్ పెన్నులను అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలో జిహెచ్ఎం హెచ్ఎంలు ప్రిన్సిపల్స్ విద్యార్థులు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడే రక్షకులుగా పర్యావరణ ప్రేమికులుగా ముందుకు రావాలని నర్వ మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ఐ రమేష్ సార్ గారు మరియు జన విజ్ఞాన వేదిక విజ్ఞాన దర్శిని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్ జిల్లా కమిటీ సభ్యుడు రామకృష్ణ నర్వ మండల పోలీస్ స్టేషన్లో ఎస్సై రమేష్ అధ్వర్యంలో ఓపెన్ చేసి అన్ని విద్యాసంస్థలు పర్యావరణం కాపాడడంలో భాగస్వామ్యం కావాలని చెప్పేసి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు కూడా పర్యావరణం కాపాడడంలో ముందుకు వచ్చి కృషి చేస్తామని చెప్పడం జరిగింది..

## ఆదివాసీల భారత రాజ్యాంగ చట్టాలు హక్కుల రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై పోరాటం చేద్దాం: చందా మహేష్



**నారాయణపేట జిల్లా :**భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆదివాసీ తెగల హక్కులు, భూమి, మరియు సంస్కృతిని రక్షించడానికి ఉద్దేశించబడింది. ఇది గిరిజన ప్రాంతాలను రక్షిత ప్రాంతాలుగా గుర్తించి, వారి అనుమతి లేకుండా ఇతరులకు భూమి బదిలీ చేయకుండా నిరోధిస్తుంది. అయితే, చాలాచోట్ల ఈ చట్టాలు సరిగా అమలు కావడం లేదని, దీనివల్ల ఆదివాసీల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, సరైన పరిహారం, పునరావాసం కల్పించడం లేదని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేష్ పేర్కొన్నారు.ఖనిజాల తవ్వకాలు, పెద్ద ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల సంస్కృతి, జీవన విధానాలు దెబ్బతింటున్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలపై పోరాడటానికి, అన్ని ఆదివాసీ సంఘాల సమన్వయంతో ఆగస్టు 28, 2025న ఏటూరు నాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఈసం నారాయణ మరియు ములుగు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో అన్ని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని దీనిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## గ్రామంలో ముందర జరిగే వినాయకచవితి దృష్టిలో ఉంచుకొని 70 మంది యువకులతో హిందూ ఉత్సవ కమిటీ



**నిర్మల్ జిల్లా //** సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో ముందర జరిగే వినాయకచవితి దృష్టిలో ఉంచుకొని 70 మంది యువకులతో హిందూ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీ అధ్యక్షులుగా కరిపే విలాస్, ఉపాధ్యక్షులుగా దాసరి ప్రశాంత్, ప్రధానకార్యదర్శి జంగం నవీన్, ప్రచార కార్యదర్శులుగా తిరుమలచారి, పొలాస మధుకర్,అల్లాడి నర్సయ్య తాంద్ర అవిందర్, సలహా సభ్యులుగా ధని గణేష్, వాసాలా నవీన్,సామల దిలీప్ దర్శనం లక్ష్మణ్,బొడ్డు లక్ష్మణ్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.చిన్న పెద్ద అందరు కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు.

## రైతులకు ఎరువులను అందించడంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు విఫలం

**ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండల హెడ్ క్వార్టర్స్ ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు ఎదుట యూరయా ఎరువుల కొరకు రైతులు పడరాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైపల్యం చెందాయని ప్రజలు విమర్శిం చారు రైతు సహకార బ్యాంకులో యురాయా అం దుబాటులో ఉన్నదని యూరయా కొరత లేదని రాష్ట్రలోని మంత్రులు అధికార పార్టీ నాయకులు అధికారులు పత్రికలలో ప్రకటనలు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడుతున్నారని కాని సోమవారం రోజున ఉదయం తాడ్వాయి ప్రాథమిక వ్యవసాయ సహాకార బ్యాంకులో ఒక యూరయా బస్తా లేదని రైతులు వ్యవసాయ పనులు వదులుకొని ఉదయం నుండి సహకార బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారని కొరమండల్ మరియు ఇతర పర్టిలైజర్ షాపు యాజమానులు ఇతర ఎరువుల బస్తాలు



కొనుగోలు చేస్తేనే యూరయా బస్తాలు ఇస్తామని షరతులు పెడుతున్నారని ఇతర పేష్టిసైడ్ మందులను అంటగడుతున్నా రని రైతులు విమర్శించారు అధికారులు పర్టిలై జర్ షాపు యజమానులు కుమ్మకై రైతుల నోట్ల మట్టి కొట్టు తూన్నారని



విమర్శలు చేస్తున్నారు రైతులకు అన్యాయం జరిగేతే సహించేది లేదని ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సాధించి రైతంగానికి యూరయా అందించాలని లేనిపక్షంలో రైతులతోపెద్ద ఎత్తున ఉద్యమాలు చెప్పడతామని హెచ్చరించారు

## గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా ఎస్పీ

**నారాయణపేట జిల్లా /** ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.గణేష్ మంటప నిర్వాహకులు తప్పనిసరిగా పాటించ వలసిన సూచనలు గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన సమయంలో కరెంట్ వైర్ల నుండి జాగ్రత్తలు పాటించాలని శోభాయాత్రలు, నిమజ్జనం కోసం ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలి. ట్రాఫిక్ కు ఆటంకం కలగకుండా మంటపాలను ఏర్పాటు చేసుకోవాలి, స్థలానికి సంబంధించిన వారి పర్మిషన్ తీసుకోవాలి. విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొని, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలి. సౌండ్ సిస్టమ్స్ ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిలో ఉండాలి. డీజే లకు అనుమతి లేదు,



రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు పూర్తిగా నినిమజ్జనం మార్గం ముందుగా పోలీసులకు తెలియజేసి, ట్రాఫిక్ కు అంతరా యం లేకుండా వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలి. ఉత్సవాల సమయంలో అన్ని మతాల వారితో సఖ్యతగా, శాంతి భద్రతలతో కార్యక్రమాలు నిర్వహించాలి.పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలి.జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,"ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందంతో జరుపుకొని నారాయణపేట జిల్లాను శాంతి, సామరస్యాలకు ఆదర్శంగా నిలబెట్టుదాం" ప్రతి ఒక్కరు పోలీసు శాఖకు సహకరించాలని అని అన్నారు.

## వలస సహాయ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**- కోస్గిలో ఎంఆర్ సీ ని ప్రారంభించిన కలెక్టర్.**

**నారాయణపేట్ జిల్లా /** నారాయణ పేట జిల్లా కోస్గి పట్టణంలో ఏర్పాటు చేసిన వలస సహాయ కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అంతర్జాతీయ వలస సంస్థ, ఆహార వ్యవసాయ సంస్థ సంయుక్తంగా కలిసి మైగ్రేషన్ మల్టీ పార్ట్ నర్ ట్రస్టు ఫండ్ అలాగే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో కోస్గి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలోని నమూనా ఇందిరమ్మ గృహంలో( మోడల్ ఇందిరమ్మ ఇల్లు) ఏర్పాటు చేసిన వలస సహాయ కేంద్రాన్ని,కేంద్రానికి సంబంధించిన మొబైల్ వ్యాన్ ను మంగళ వారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిజామాబాద్, నారాయణ పేట జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ వలస సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వాతావరణ మార్పుల వల్ల కలిగే వైపరిత్యాలను తట్టుకునేందుకు, గ్రామాలలోని వలస కుటుంబాలకు, ఆయా కుటుంబాల మహిళ లు, యువత కు వ్యవసాయ, వ్యవసాయేతర జీవనోపాధులను మెరుగు పర్చుకునేందుకు అవసరమైన శిక్షణలు, నైపుణ్యాలు ఇవ్వడం జరుగుతుందని, అలాగే సురక్షితమైన క్రమబద్ధమైన



వలసల గురించి వారి మానసిక శ్రేయస్సు గురించి అవగాహన, మార్గదర్శకం, సలహాలు సంప్రదింపుల సేవలను వలస సహాయ కేంద్రం ద్వారా పొందవచ్చని కలెక్టర్ వివరించారు. వలస సహాయ కేంద్రానికి అనుబంధంగా వలస సహాయ కేంద్రం( మారుమూల గ్రామాలకు సమాచారం, అవగాహన కోసం) మొబైల్ వ్యాన్ ఉపయోగపడుతుందన్నారు. వలస సహాయ కేంద్రం,మొబైల్ వ్యాన్ సేవలతో పాటు కేంద్రానికి అనుబంధంగా ప్రవాసీ కౌన్సిలింగ్ సెంటర్ కు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ 1800-599-1393 పని చేస్తుందని ఆమె తెలిపారు. జిల్లాలోని కోస్గి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహన,శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారని చెప్పారు. రెండేళ్ల పాటు ఈ వలస సహాయ కేంద్రం సేవలు అందుతాయని చెప్పారు. గత ఫిబ్రవరి లో జిల్లాలో వలసల గురించి తెలుసుకునేందుకు జపాన్ కు చెందిన ఓ సంస్థ సభ్యులు నారాయణపేట కు వచ్చారని ఆమె



గుర్తు చేశారు. జిల్లాలో వలసల నివారణకు ఇలాంటి పెద్ద పెద్ద ప్రాజెక్టులు మరెన్నో రావాలని తద్వారా వలసలు లేని జిల్లాగా నారాయణపేట మారాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, డీఆర్ డీ ఏ మొగులప్ప, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. ఇలాంటి ప్రాజెక్టులు జిల్లాకు ఎన్నో రావాలని, వాటి ద్వారా జిల్లాలో వలసలు పూర్తిగా నివారించబడాలని అన్నారు. వలస సహాయ కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ ను విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్వాహకులను కోరారు. కేంద్రానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఓ ఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, సహాయ సమన్వయకర్త మార్ష ఆశీర్, సంస్థ ఫీల్డ్ ఫెసిలిటెటవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విజేత హై స్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించే మంచి ఉద్దేశంతో తాము స్వయంగా చేతులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.



**నిర్మల్ జిల్లా //** తానూర్ మండలంలోని బేల్ తారోడ గ్రామంలోనివిజేత హై స్కూల్ విద్యార్థుల చేతులమీదుగా రూపొందిన వెయ్యి మట్టి వినాయకుల పంపిణీ చేయడం జరిగింది. విజేత హై స్కూల్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించే మంచి ఉద్దేశంతో తాము స్వయంగా చేతులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.దాదాపు వెయ్యి మట్టి వినాయ కులను విద్యార్థినీ-విద్యార్థులు శ్రమతో, భక్తితో రూపొందించారు. అనంతరం ఈ వినాయక విగ్రహాలను తనూర్ మండలంలోని అధికారులకు, స్థానిక ప్రజానీకానికి అందజేశారు.ఈ సందర్భం లో విద్యార్థులు ప్రతి ఒక్కరికి ్ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల బదులు మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావం ్ణాన్ని





కాపాడుకోవాలి అనే సందేశాన్ని అందించారు.ప్రకృతిని సంరక్షిస్తూ భగవంతుని అనుగ్రహాన్ని పొందాలని, పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.ఈ కార్యక్రమంలో





విజేత హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రాథోడ్ గణేష్, పాఠశాల కార్యదర్శి శ్రీ రమేష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ రోగులకు అవగాహన సదస్సు

**అపెక్స్ సెంటర్ ఇంచార్జ్ రాజశేఖర్**


**షాద్ నగర్ ఆగస్ట్ 26:**షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నందు అపెక్స్ డయాలసిస్ సెంటర్లో డయాలసిస్ ట్రీట్మెంట్ తీసుకుంటున్న రోగులకు అపెక్స్ సెంటర్ నిర్వహిస్తున్న ఇన్చార్జి రాజశేఖర్ డయాలసిస్ చికిత్స గురించి మాట్లాడుతూ , మానవుని శరీరంలోని కిడ్నీ విఫలమైనప్పుడు మరియు కిడ్నీ మీ శరీర అవసరాలకు చూసుకో లేనప్పుడు డయాలసిస్ అవసరం అవుతుంది. డయాలసిస్ చేసినప్పుడు మీ శరీరం నుండి వ్యర్థాలు ఉప్పు మరియు అదనపు ద్రవ్యాన్ని మీ శరీరంలో పేరుకు పోకుండా బయటకి పంపిస్తుందని రాజశేఖర్ తెలియజేశారు. డయాలసిస్ చేయడం వలన అధిక సోడియం, పొటాషియం మొదలైన కొన్ని ఎలక్ట్రోలైట్లను సరైన స్థాయిలో నిర్వహించబడుతుంది అని రాజశేఖర్ తెలిపారు. షాద్ నగర్ డయాలసిస్ సెంటర్లో ప్రతిరోజు 18 నుండి 20 మందికి డయాలసిస్ నిర్వహిస్తున్నామని, మొత్తం పేషెంట్లు 43 మంది ఉన్నారని, నెలలో 480 మందికి డయాలసిస్ నిర్వహిస్తున్నామని రాజశేఖర్ తెలియజేశారు. అందువలన షాద్నగర్ లోని పేషెంట్లు మన ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ లు నాగమణి , పద్మ మరియు నరేష్ టెక్నీషియన్ పాల్గొన్నారు.



# ప్రకృతిని ఆరాధిద్దాం మట్టి గణపతులనే పూజిద్దాం....

**మట్టి వినాయక విగ్రహాల పంపిణీ....**



**నిర్మల్ జిల్లా //** కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాల నందు మట్టితో చేసిన వినాయకులను ప్రతి ఒక్కరు పూజించాలని దానితో పాటు పర్యావరణాన్ని నీళ్ల కలుషితం కాకుండా పర్యావర ణాన్ని రక్షించ వచ్చని, కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాల నందు వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని, విద్యార్థులతో ఉపాధ్యాయులు మట్టి విగ్రహాలను తయారు చేయించి, కాలుష్య నివారణ కోసం తమవంతుగా గత కొద్ది సంవత్సరాలుగా వినాయక మట్టి విగ్రహాలు పల్సి గ్రామంలో వీధి వీధికి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పురం శెట్టి లింగయ్య, కరస్పాండెంట్ గంగాసింగ్, పోతన్న, రామకృష్ణ,కొట్టే రాజు, ప్రవీణ్,భోజన్న, సాయినాథ్, దేవకి, సరోజన, గంగామణి, సరస్వతి,కవిత, శృతిక, నేహా, పద్మ, శ్రీవిద్య, నందిని, రాణి, అంజలి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# యూనిక్ ఇంగ్లీష్ మీడియా స్కూల్ లో డిస్టిక్ లెవెల్ కుంగ్ ఫు కరాటే టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ

**టోర్నమెంట్ బ్రోచర్లు ను ఆవిష్కరించిన యూనిక్ స్కూల్ ప్రిన్సిపల్ నరేందర్**



**షాద్నగర్ :** సెప్టెంబర్ 14 వ తేదీన మాస్టర్ బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించ నున్న డిస్టిక్ లెవెల్ కుంగ్ ఫు కరాటే టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా షాద్ నగర్ యూనిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ నరేందర్ వారి చేతుల మీదుగా టోర్నమెంట్ బ్రోచర్ని ఆవిష్కరించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ యొక్క టోర్నమెంట్ మన స్కూల్ తరపున విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని స్కూల్ యొక్క పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. బాలరాజ్ మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ కుంగ్ ఫు కరాటే పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభను కనబరచాలని, పోటీలకు సిద్ధం కావాలని, ఆత్మస్థైర్యం, శారీరక పట్టుత్వం, మానసిక ప్రశాంతతకు ఈ విద్యలు నేర్చుకోవడం విద్యార్థులకు అత్యంత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ పవర్ కుంగ్ ఫు మాస్టర్ నంది అవార్డు గ్రహీత అహ్మద్ ఖాన్ ( బ్రూస్ లీ ),కుంగ్ ఫు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రత్యేక అధికారి కి ఘనంగా సన్మానం



**ఉట్కూర్ మండలం :** నారాయణపేట్ జిల్లా ఉట్కూర్ మండల ప్రత్యేకాధి కారి ,శ్రీ కె.ఉమాపతి డిఎస్ సి డి ఓ గా పదోన్నతి పై నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్తున్నందున్న , ఈ 11 నెలల కాలం ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించి ఉట్కూర్ మండలంలో వివిధ ప్రభుత్వ పథకాలను అమలు అమలు పరచడంలో వారి వంతు పాత్ర అభినందనీయమని,ఇట్టి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు వారి సేవలను కొనియాడారు , ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ధనుంజయ గౌడ్,,ఎంపీఓ రాజు,ఏపీఓ లక్ష్మ రెడ్డీ , పంచాయతీ కార్యదర్శులు ,జగదీష్,శ్రీనివాసరావు, అశోక్,ఉపాధి హామీ సిబ్బంది కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారం లో బస్టాండ్ నిర్మించాలి

**యూత్ జేఏసీ ములుగు జిల్లా కో కన్వీనర్ సొలం రాంబాబు డిమాండ్**



**మేడారం:** ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన మేడారం లో బస్టాండ్ నిర్మించాలని యూత్ జేఏసీ ములుగు జిల్లా కో కన్వీనర్ సొలం రాంబాబు డిమాండ్ చేశారు వచ్చే సంవత్సరం జనవరి లో జరిగే జాతర అభివృద్ధి కి నిధులు కేటాయించిన ప్రభుత్వం మేడారం లో మరియు ఊరట్టం స్థూపం దగ్గర కొత్తూరు ఊరట్టంకాలనీ వెంగ్లాపూర్ లలో బస్టాండ్ నిర్మించాలని మర్చిపోయారు అని విమర్శించారు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇస్తూ రైల్వే సౌకర్యం మంజూరు చేసిన స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బస్టాండ్ గురించి పట్టించుకోవడం లేదని ఎందుకు అంటే ఈ ప్రభుత్వం కు మేడారం అంటే వివక్ష ఉంది కాబట్టి అని అందుకే మేడారం ప్రాంతం వాళ్ళు అందరు మేడారం ప్రత్యేక మండలం ఏర్పాటు కోరుకుంటున్నారు అని స్థలం ఉండి నిధులు ఉన్న ఎందుకు బస్టాండ్ లు నిర్మించడం లేదో అర్థం కావడం లేదని విమానాశ్రయం అయినా వస్తుంది కావచ్చు కానీ బస్టాండ్ కాదు అన్నట్లు పరిస్థితి ఉంది అని ఇప్పటికి అయినా ప్రభుత్వం స్పందించి బస్టాండ్ లు నిర్మించాలని లేకుంటే ప్రజలు కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తారు అని హెచ్చరించారు

# 21 వార్డులో బీజేపీ యువ నాయకులు క్యామ మహేష్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ కార్యక్రమం

**భక్తి శ్రద్ధలతో వినాయకుడిని పూజిద్దాం.విఘ్నాలు తొలగాలని ప్రార్థిద్దాం**



**షాద్ నగర్ ఆగస్ట్ 26:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 21వ వార్డులో బీజేపీ యువ నాయకులు క్యామ మహేష్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ యువ నాయకులు క్యామ మహేష్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో వినాయక పూజకు విశిష్టమైన ప్రాధాన్యం ఉందని, ప్రతి శుభకార్యానికి ముందు వినాయక పూజ చేసే ఆచారం మన సాంప్రదాయ మహిమాన్వితం అని అన్నారు. ప్రతి ఇంటిలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల సమాజంలో ఆధ్యాత్మికత పెంపొందుతుందని, విఘ్నాలు తొలగిపోతాయని విశ్వాసం ఉన్నందునే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి శిక్షణలు అందించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**
**మహిళలు విభిన్న రంగాల్లో స్వయం ఉపాధి పొందేలా శిక్షణలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.**




**నిర్మల్:** పట్టణంలోని మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం చించోలి సమీపంలోని మహిళా ప్రాంగణంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రాంగణంలో సర్పంచ్‌లు, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు, మహిళా సంఘాలు, కిశోర బాలికలు తదితరులకు అనేక శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయని, అలాగే పీఎం విశ్వకర్మ పథకం కింద బ్యూటీషియన్, కంప్యూటర్, కుట్టు రంగాల్లో శిక్షణలు పూర్తయ్యాయని మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్ విజయలక్ష్మి వివరించారు. అనంతరం కలెక్టర్ అభిలాష్ అభినవ్, మాట్లాడుతూ, జిల్లాలో స్వయం ఉపాధి కల్పించేలా మహిళలకు కుట్టుమిషన్, అల్లికలు, టైలరింగ్, బ్యూటీ పార్లర్, పేపర్ బ్యాగ్ తయారీ, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటి రంగాల్లో శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు. మండలాల వారీగా ఆసక్తి గల మహిళలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి, అధిక సంఖ్యలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు విజయలక్ష్మి, మోహన్ సింగ్, నరసింహారెడ్డి, శంకర్, సిడిపిఓ సరిత, మహిళా ప్రాంగణ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను చైతన్యం చేసే విధంగా జర్నలిస్టులు ముందుకు రావాలి



**నారాయణపేట్ జిల్లా /** :సమాజంలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు జర్నలిస్టులు ముందుకు రావాలని టీయూ డబ్ల్యు జే జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోస్గి మండల కేంద్రంలోని అంబేద్కర్ పార మెడికల్ కళాశాలలో జరిగిన టీయూ డబ్ల్యు జే మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జర్నలిజం లో నూతన మార్పులు తేవడానికి టి యు డబ్ల్యు జె నిరంతరం కృషి చేస్తూనే ఉందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంఘం హర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. జర్నలిస్టు సైతం తమ బాధ్యతలను విస్మరించకుండా నియమ నిబంధనలతో పనిచేయాల్సిందని సూచించారు. జర్నలిస్టు ముసుగులో సైతం అక్రమాలకు పాలు పెడితే యూనియన్ సభ్యత్వాన్ని రద్దు చేయడానికి కూడా వెనుకాడే ప్రసక్తి లేదని హెచ్చరిస్తూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా వెనకాడమని అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యతోపాటు కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందించే విధంగా ఈరోజు టి యు డబ్ల్యు జే కృషి చేసిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని ఆధారంగా వార్తలు రాయొద్దని పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతనే వార్తగా పెట్టాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులను అరికట్టేందుకు నిజాయితీగా పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్ ఎప్పుడు కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈనెల 30 న నారాయణపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాన్ని టీయూ డబ్ల్యు జే సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మీడియా ప్రతినిధులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం గోడ పత్రికను విడుదల చేసారు. ఈకార్యక్రమంలో టీయూ డబ్ల్యు జే జిల్లా ఎడ్యుకేషన్ ఇంచార్జి రాజేష్, హెల్త్ కమిటీ ఇంచార్జి సంజీవ్,రఘు ఘణప,సురేష్, మండల అధ్యక్షుడు శంకర్, టీయూ డబ్ల్యు జే నాయకులు అజీజ్,మసుల వెంకట్,చంద్రశేఖర్, శ్రీనివాస్, మోహన్,సల్మాన్ రాజ్,అతిక్,మల్లేష్,ప్రవీణ్,దత్తు,చైతన్య,రమేష్ గౌడ్,తహసీన్,రషీద్,రాజు,తదితరులు ఉన్నారు.

# మండల ప్రజలకు గణేష్ నవరాత్రి ఉత్సవాల హార్దిక శుభాకాంక్షలు

**ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందంతో జరుపుదాం...**
**-శాంతి, సామరస్యాలకు ఆదర్శంగా నిలబెట్టుదాం...**
**-మిడ్జిల్ ఎసై శివ నాగేశ్వర్ నాయుడు**




**మిడ్జిల్, 26 ఆగష్టు 2025:**మిడ్జిల్ మండల కేంద్ర పరిదిలో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పాటించ వలసి నసూచనలు తిసుకోవలన్నారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టా పన సమయంలో కరెంట్ వైర్ల నుండి జాగ్రత్తలు పాటించాలని శోభాయాత్రలు, నిమజ్జనం కోసం ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలి. ట్రాఫిక్ కు ఆటంకం కలగకుండా మంటపాలను ఏర్పాటు చేసుకోవాలి, స్థలానికి సంబంధించిన వారి పర్మిషన్ తీసుకోవాలి. విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొని, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలి. సౌండ్ సిస్టమ్స్ ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిలో ఉండాలి. డీజే లకు అనుమతి లేదు, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు పూర్తిగా నినిమజ్జనం మార్గం ముందుగా పోలీసులకు తెలియజేసి, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలి. ఉత్సవాల సమయంలో అన్ని మతాల వారితో సఖ్యతగా, శాంతి భద్రతలతో కార్యక్రమాలు నిర్వహించాలి. పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలి. జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,“ఉత్సవాలను శాంతియుతంగా, ఆనందంతో జరుపుకొని మిడ్జిల్ మండలంను శాంతి, మత, సామరస్యాలకు ఆదర్శంగా నిలబెట్టుదాం” ప్రతి ఒక్కరు పోలీసు శాఖకు సహకరించాలని అని అన్నారు.


# బిపియం లకు మొబైల్ ఫోన్లు అందజేత



**నారాయణపేట్ జిల్లా /** :గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ నారాయణ పేట మరియు జిల్లా పోస్ట్ ఆఫీస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బిపియం(బ్రాంచ్ పోస్ట్మాస్టర్ల)కు శాంసంగ్ మొబైల్ ఫోన్లు మరియు మంత్ర డివైజ్ లు పంపిణీ చేయడం జరిగినది. జిల్లాకు సెర్ప్ కార్యాలయం హైదరాబాదు నుండి 137 సాంసంగ్ మొబైల్స్ మరియు 137 మంత్రా డివైజ్ లు రావడం జరిగింది వాటిని1. స్వప్న బీపీ ఎం జలాల్పూర్ , 2.గౌతమి బీపీ ఎం జాజాపూర్, 3 నరసన్న బీపీఎం తిప్రస్పల్లి, 4 శ్రీనివాస్ బీపీఎం లోకుర్తి , 5 తేజ బీపీ ఎం కంసాన్పల్లి తదితరులకు గౌరవ జిల్లా కలెక్టర్ మేడం మొబైల్ ఫోన్లు ,మంత్ర డివైజ్ లు అందించడం జరిగింది జులై మాసానికి సంబంధించిన పెన్షన్లు 68,973 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ. 17,72,77,856 రూపాయలు జులై మాసానికి సంబంధించిన వాటిని రెండు మూడు రోజుల తరువాత నుండి ముఖ గుర్తింపు యాప్ ద్వారా పంపిణీ చేయడం ప్రారంభమవుతున్నది ఈ కార్య్ కమంలో గౌరవ జిల్లా కలెక్టర్ మేడం శ్రీమతి సిక్తా పట్నాయక్ ఐఏఎస్ మరియు శ్రీ మొగులప్ప డిఆర్డిఓ నారాయణపేట ,జయన్న డిపిఎం జుబేర్ పోస్టల్ ఇన్స్పెక్టర్ సి ఓ రాజేందర్ , ఉమాకాంత్ మెయిల్ వెర్షన్ మరియు వివిధ గ్రామాలకు సంబంధించి చెందిన బిపియం లు పాల్గొనడం జరిగింది

# వినాయక విగ్రహం అందజేసి యువతలో ఐక్యత స్ఫూర్తి నింపిన టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జెట్ట నాగేష్





**షాద్ నగర్ ఆగస్ట్ 26:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని నందిగామ మండలం మోత్కుల గూడ గ్రామంలో శివాజీ యూత్ సభ్యులకు బిఆర్ఎస్ యువ నేత జెట్ట నాగేష్ వినాయకుడి విగ్రహాన్ని అందజేయడం విశేషంగా మారింది. గ్రామ యువత ఆత్మీయతతో, ఐక్యతతో ముందుకు సాగేందుకు ఇది ఒక శుభసంకేతంగా నిలిచింది. ఈ సందర్భంగా జెట్ట నాగేష్ మాట్లాడుతూ...యువతే ఈరోజు సమాజానికి బలం. వారి ఆలోచనలు, వారి కృషి రేపటి సమాజానికి దారి చూపు తాయి. వినాయకుడు విద్య, విజయం, శుభారంభాలకు ప్రతీక. ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ యువతపై ఉండాలని ఆకాంక్షిస్తు న్నానని అన్నారు. శివాజీ యూత్ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ...గ్రామ యువతను ప్రోత్సహిస్తూ, ఆధ్యాత్మికతతో కూడిన వినాయకుడి విగ్రహం అందజేయడం మాకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. జెట్ట నాగేష్ లాంటి నాయకులు ఎల్లప్పుడూ మాకు దారి చూపుతారని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగింది. శివాజీ యూత్ యువకులు వినాయక చవితి వేడుకలకు సిద్ధమవుతుండగా, గ్రామ ప్రజల్లో స్ఫూర్తి, ఐక్యత వాతావరణం నెలకొంది.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం మట్టి గణపతులను ప్రతిష్టిద్దాం

**ఆర్ జి ఐ ఏ పి ఎస్ సి ఐ బాలరాజు**



**రాజేంద్రనగర్, ఆగస్ట్ 26.** పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే మట్టి గణపయ్యాలని ప్రతిష్టించుకోవాలని ఆర్ జి ఐ ఏ పి ఎస్ సి ఐ బాలరాజు తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో మంగళవారం గణేష్ నవరాత్రుల ను పురస్కరించుకొని శంషాబాద్ బస్టాండ్ శ్రీ వినాయక టెంపుల్ వద్ద బి ఆర్ ఎస్ నాయకులు మహర్షి ఫౌండేషన్ చైర్మన్ కొనమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంషాబాద్ పట్టణ సీఐ బాలరాజు విచ్చేసి భక్తులకు మట్టి గణపయ్య ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ బాలరాజు మాట్లాడుతూ మట్టి గణపయ్యలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తులందరూ సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నందు, పెదిరిపాటి మురళి గౌడ్, పరంధాములు, జయసింహ, నరేందర్, హరికృష్ణ, రమేష్ రాథోడ్, నరసింహ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా కప్ కోసం జాబితా ప్రకటించిన 6 దేశాల జట్లు







ఆసియా కప్ టోర్నీ ప్రారంభం కావడానికి ఇంకా 2 వారాల సమయం మాత్రమే ఉంది. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మొత్తం 8 ఆసియా జట్లు పాల్గొంటాయి. భారత్, పాకిస్తాన్ గ్రూప్ ఏలో ఉన్నాయి. దాయాది జట్లు ఇప్పటికే తమ జట్లను ప్రకటించాయి. 2 గ్రూపుల్లోని 3-3 జట్లు తమ జట్లను ప్రకటించాయి, మరో 2 జట్లు ఆటగాళ్ల జాబితా విడుదల చేయాల్సి ఉంది. అయితే 6 జట్లలోని ఆటగాళ్ల వివరాలు ఇవి. ఆసియా కప్ 2025లో భాగంగా సెప్టెంబర్ 9 నుంచి 19 వరకు గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. మొత్తం 8 జట్ల మధ్య 12 లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని అన్ని జట్లతో ఒక్క మ్యాచ్ ఆడుతుంది. ఆ తర్వాత 2 గ్రూపుల నుంచి టాప్ 2 జట్లు సూపర్ ఫోర్‌కు చేరుకుంటాయి. మిగిలిన 4 జట్లు ఇంటిదారి పడతాయి. గ్రూప్ %ూా , దీ% ల నుండి మూడేసి జట్లు తమ ఆటగాళ్లను ప్రకటించాయి. **గ్రూప్ ఏ జట్ల వివరాలు:భారత జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, సంజూ శాంసన్ జితేశ్ శర్మ, అక్షర్ పటేల్, రింకు సింగ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్.పాకిస్తాన్ జట్టు: సల్మాన్ అలీ ఆగా (కెప్టెన్), ఫహీమ్ అష్రఫ్, అబ్రార్ అహ్మద్, ఫఖర్ జమాన్, హారిస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారిస్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీం జూనియర్, సల్మాన్ మిర్జా, షాహీన్ అఫ్రిది, సుఫ్యాన్ మోకిమ్.ఒమన్ జట్టు: జతిందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మిర్జా, సుఫ్యాన్ యూసుఫ్, ఆశిష్ ఒడెడేరా, వినాయక్ శుక్లా, ఆమిర్ కలీమ్, మహ్మద్ నదీమ్, సుఫియాన్ మహమూద్, ఆర్యన్ బిష్త్, హస్నైన్ అలీ షా, ఫైసల్ షా, మహ్మద్ ఇమ్రాన్, కరణ్ సోనవాలే, జిక్రియా ఇస్లాం, నదీమ్ ఖాన్, షకీల్ అహ్మద్, సమయ్ శ్రీవాస్తవ. **గ్రూప్ బీ జట్ల వివరాలు:** అఫ్ఘనిస్తాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), ఇబ్రహీం జద్రాన్, రెహ్మానుల్లా గుర్బాజ్, దర్విష్ రసూలి, సెడిఖుల్లా అటల్, కరీమ్ జనత్, మహ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, అల్లాహ్ గజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫరీద్ మాలిక్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్-ఉల్-హక్, ఫజల్‌హక్ ఫరూఖీ.బంగ్లాదేశ్ జట్టు: లిటన్ దాస్ (కెప్టెన్), తంజీద్ హసన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, జేకర్ అలీ అనిక్, పర్వేజ్ హుస్సేన్ ఇమోన్, షమీమ్ హుస్సేన్, ఖాజీ నూరుల్ హసన్ సోహన్, రిషద్ హుస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, మెహెదీ హసన్, తంజీమ్ హసన్ సాకిబ్, షోరుఫుల్ ఇస్లాం, సైఫ్ ఉద్దీన్, తస్కిన్ అహ్మద్. హాంగ్‌కాంగ్ జట్టు: యాసిమ్ ముర్తజా (కెప్టెన్), బాబర్ హయాత్, నసరుల్లా రాణా, మార్టిన్ కోయెట్జీ, అన్షుమాన్ రాథ్, జీషన్ అలీ, నిజాకత్ ఖాన్ మహ్మద్, కల్హన్ మార్క్ చల్లా, ఆయుష్ ఆశిష్ శుక్లా, మహ్మద్ ఎజాజ్ ఖాన్, ఆదిల్ మహమూద్, హరూన్ మహ్మద్ అర్షద్, అలీ హసన్, షాహిద్ వాసిఫ్, అతిక్ ఉల్ రెహ్మాన్ ఇక్బాల్, కించిత్ షా, గజన్‌ఫర్ మహ్మద్, మహ్మద్ వహీద్, అనాస్ ఖాన్, ఎహ్సాన్ ఖాన్.

# బంగారు పతకం కైవసం చేసుకున్న మీరాబాయి చాను




టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్స్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా ఆమె సోమవారం మొత్తం 193 కిలోల (84 కిలోలు ం 109 కిలోలు) బరువును ఎత్తింది. టోటల్, స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్ రికార్డులను మీరాబాయి చాను బద్దలు కొట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచింది. 84 కిలోల తన ప్రారంభ స్నాచ్ ప్రయత్నంలో మీరాబాయి కాస్త అసౌకర్యానికి గురైంది. ఆమె కుడి మోకాలిలో నొప్పి రావడంతో ఇబ్బందిపడింది. కానీ ఆమె తన పట్టువిడవకుండా రెండో ప్రయత్నంలో దీన్ని క్లియర్ చేసింది. అయితే 89 కిలోల మూడో ప్రయత్నంలో ఆమె విఫలమైంది. తదుపరి ప్రయత్నంలో ఆమె క్లీన్ అండ్ జెర్క్‌లో ఏకంగా 105 కిలోల బరువును ఎత్తింది. తరువాత దాన్ని109 కిలోలకు పెంచింది. అయితే 113 కిలోల చివరి ప్రయత్నాన్ని ఆమె పూర్తి చేయలేకపోయింది. అయితే టోటల్, స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్ రికార్డులను బద్దలుగొట్టిన ఆమె గోల్డ్‌ను కైవసం చేసుకుంది.మలేషియా క్రీడాకారిణి ఐరీన్ హెన్రీ 161 కిలోలు (73 కిలోలు ం 88 కిలోలు) ఎత్తి రజతం గెలుచుకుంది. వేల్స్ క్రీడాకారిణి నికోల్ రాబర్ట్స్150 కిలోలు ఎత్తి (70 కిలోలు ం 80 కిలోలు) కాంస్యం సాధించింది.31 ఏళ్ల మీరాబాయి పారిస్ ఒలింపిక్స్‌లో ఆడిన తర్వాత 49 కిలోల విభాగం నుంచి దిగువకు వచ్చింది. అయితే ఇకపై ఈ విభాగం ఒలింపిక్స్‌లో కనిపించదు. మీరాబాయి చాను గత ఆగస్టులో పారిస్ ఒలింపిక్స్‌లో 4వ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆమె మళ్లీ పోటీపడటం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. 48 కిలోల వెయిట్‌లిఫ్ట్ విభాగంలో ఆమె ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ సహా 2 కామన్వెల్త్ గేమ్స్ పతకాలు గెలుచుకుంది. అయితే ఆమె 2018 నుంచి ఈ విభాగంలో పోటీ పడలేదు.ఇంగ్లాండ్ వేదికగా 2022 ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను భారత్‌కు బంగారు పతకం అందించింది. 49 కిలోల విభాగంలో స్టార్ వెయిట్ లిఫ్టర్ 201 కేజీల బరువు ఎత్తి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సాధించింది. కాగా చానుపై హాలీవుడ్ స్టార్, 'థోర్' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రిస్ హేమ్స్‌వర్త్ ప్రశంసలు కురిపించారు. ఇందుకు ఆమె యోగ్యురాలు అంటూ కొనియాడారు.పసిడి పతకం సాధించిన అనంతరం చాను ఇందుకు సంబంధించిన ఫొటోలను తన ట్విటర్ ఖాతాలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బరువులు ఎత్తడాన్ని ఉద్దేశిస్తూ సౌరభ్ సిన్హా అనే యూజర్ ఆమె ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ, 'థోర్ తన సుత్తిని వదులుకునే సమయం వచ్చింది' అంటూ ట్వీట్ చేశాడు. దాన్ని క్రిస్ హేమ్స్‌వర్త్ ట్విటర్ ఖాతాకు ట్యాగ్ చేశాడు. కాగా దీనిపై హాలీవుడ్ స్టార్ స్పందిస్తూ, సిక్కింకు చెందిన చానును ప్రశంసించారు. 'ఆమె యోగ్యురాలు. కంగ్రాట్స్ సైఖోమ్. నువ్వో లెజెండ్' అంటూ ట్వీట్ చేశారు. థోర్ సినిమాల్లో ప్రత్యేకమైన సుత్తితో హేమ్స్‌వర్త్ కనిపించిన విషయం తెలిసిందే. ఆ సుత్తిని ఎత్తగల ప్రత్యేక శక్తులు అతడికే ఉంటాయి.

# ఇద్దరిని రిలీజ్ చేయనున్న బెంగళూరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 18 ఛాంపియన్స్ అయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వచ్చే సీజన్‌కు ముందు తమ ఆటగాళ్లలో చాలా మందిని నిలుపుకోవడం ఖాయం. అయితే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇద్దరు ఆటగాళ్లను నిలుపుకోలేకపోతుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ప్రత్యామ్నాయంగా వచ్చే ఆటగాళ్లను తదుపరి సీజన్ కోసం నిలుపుకోవచ్చు. అయితే, తాత్కాలిక ప్రత్యామ్నాయంగా ఎంపికైన ఆటగాళ్లను జట్టులో నిలుపుకోలేరు. ఆర్‌సీబీ ఇద్దరు తాత్కాలిక ప్రత్యామ్నాయాలను తీసుకువచ్చింది. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ ముప్పు కారణంగా ఐపీఎల్ 2025 కొన్ని వారాల పాటు వాయిదా పడింది. ఫలితంగా, జాకబ్ బెథెల్, లుంగి న్గిడి ఫైనల్ మ్యాచ్‌లకు అందుబాటులో లేరు. ఇంతలో, ఆర్‌సీబీ ఇద్దరు తాత్కాలిక ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసింది. ఐపీఎల్‌లో చివరి రెండు మ్యాచ్‌లలో ఆర్‌సీబీ తరపున ఆడిన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజ్జరబానీని కూడా జట్టు నుంచి తొలగించనున్నారు.

# లేడీ పోలీస్ ఆఫీసర్‌కి ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్



జైపూర్ క్రీడాకారులు క్రీడా పోటీలలో నిరంతరం బంగారు పతకాలు సాధిస్తున్నారు. జైపూర్‌కు చెందిన కచ్నార్ చౌదరి రీసెంట్‌గా చెన్నైలో జరుగుతున్న సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో 15.75 మీటర్ల దూరంతో షాట్‌పుట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. అంతకు ముందు ఆమె రాష్ట్ర ఛాంపియన్ షిప్‌లో 14.98 మీటర్లతో స్వర్ణం గెలుచుకుంది. సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె ఆట మరింత మెరుగుపడింది. అయితే, ఆమె ఇంకా తన అత్యుత్తమ ప్రతిభను సాధించలేకపోయింది.ఇది ఆమెను ఒలింపిక్స్ రేసులో ఉంచుతుంది. కాచ్నార్ కాకుండా రాజస్థాన్‌కు చెందిన నలుగురు క్రీడాకారులు సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో టాప్-10లో చోటు దక్కించుకున్నారు.అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీస్ క్రీడలలో, కచ్నార్ చౌదరి షాట్‌పుట్‌లో 14.98 మీటర్లతో స్వర్ణం , డిస్కస్ త్రోలో రజత పతకాన్ని గెలుచుకున్నారు. రాష్ట్ర అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో కచ్నార్ 18.41 మీటర్ల జాతీయ రికార్డు కంటే కేవలం 3.5 మీటర్ల వెనుకబడి బంగారు పతకాన్ని కూడా గెలుచుకుంది. కచ్నార్ వరుసగా రెండుసార్లు ప్రపంచ పోలీస్ క్రీడలలో పతకాలు సాధించింది. ప్రపంచ పోలీస్ క్రీడల్లో 70 దేశాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. దీనితో పాటు అమెరికాలోని అలబామాలోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రపంచ పోలీస్ , ఫైర్ గేమ్స్‌లో కచ్నార్ చౌదరి బంగారు పతకం గెలుచుకున్నారు.కచ్నార్ చౌదరి తన షాట్‌పుట్ ఆటను 9 సంవత్సరాల క్రితం ప్రారంభించారు, అప్పటి నుండి ఆమె అనేక పోటీలలో బంగారు , వెండి పతకాలను గెలుచుకుంది. కచ్నార్ చౌదరి తండ్రి పరేష్ చౌదరి కూడా షాట్‌పుట్ , డిస్కస్ త్రోయర్. చెన్నైలో జరిగిన సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో సీనియర్ విభాగంలో కచ్నార్ చౌదరికి ఇది మొదటి బంగారు పతకం.ఈ పోటీలో ఆమె తన రెండవ ప్రయత్నంలో 15.41 మీటర్లు నాల్గవ ప్రయత్నంలో 15.75 మీటర్ల దూరం ప్రయాణించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె ముంబైలోని రిలయన్స్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌లో ప్రాక్టీస్ చేస్తోంది.కచ్నార్ చౌదరికి 19 సంవత్సరాల వయసులో రైల్వేస్‌లో ఉద్యోగం వచ్చింది. దీని తర్వాత ఆమె రాజస్థాన్ పోలీస్‌లో చేరింది. ప్రస్తుతం ఆమె రాజస్థాన్ పోలీస్‌లో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. భారతదేశంలో వివిధ దేశాలలో జరిగిన పోలీస్ గేమ్స్ వంటి అనేక పోటీలలో ఆమె అనేక పతకాలు గెలుచుకుంది. కచ్నార్ చౌదరి ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కూడా బంగారు పతకం గెలుచుకున్నారు. వివిధ పోటీలలో నిరంతరం పతకాలు సాధించడం ద్వారా, కచ్నార్ రాజస్థాన్ పోలీస్ పేరును ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిస్తోంది. ఆమెను అనేకసార్లు సత్కరించారు. క్రీడలతో పాటు, కచ్నార్ చౌదరి చదువులో కూడా టాపర్‌గా నిలిచింది. ఆమె 12వ తరగతిలో 90% మార్కులు సాధించి బిఎ, ఎంఎ (ఇంగ్లీష్)లో ఫస్ట్ డివిజన్ సాధించిం ది. ప్రస్తుతం కచ్నార్ ఎల్ఎల్‌బి చదువుతోంది. క్రీడలను చదువుతో సమతుల్యం చేసుకోవడం చాలా కష్టమని కచ్నార్ చౌదరి అంటున్నారు. క్రీడలు , చదువు రెండింటిలోనూ విజయం సాధించాలంటే నిరంతరం కష్టపడి పనిచేయాలి. 1999 మే 17న చురు జిల్లాలోని సుజన్‌గఢ్ పట్టణంలో జన్మించారు. కచ్నార్ చౌదరి తల్లి అనితా సింగ్ తండ్రి పరేష్ చౌదరి రాజస్థాన్ విద్యా శాఖలో పనిచేస్తున్నారు. కచ్నార్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 1.76 లక్షల మంది, యూట్యూబ్‌లో 1 లక్ష మంది. ఫేస్‌బుక్‌లో 3.09 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. తన తొలి అంతర్జాతీయ క్రీడను 19 సంవత్సరాల వయసులో ఆడింది, అక్కడ ఆమె రాజస్థాన్ నుండి షాట్ పుట్‌లో అతి పిన్న వయస్కురాలైన అథ్లెట్. కచ్నర్ తన షాట్ పుట్ ఆట కోసం వివిధ ప్రదేశాలలో శిక్షణ పొందింది. ఆమె జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోచ్ వీరేంద్ర పూనియాతో కలిసి చాలా కాలం పాటు ప్రాక్టీస్ చేసింది. కచ్నర్ చౌదరి ఇప్పటివరకు 2024లో ఇంటర్-స్టేట్ నేషనల్‌లో షాట్‌పుట్‌లో 16.76 మీటర్లు చేసింది, ఇది ఆమె వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన. 18 సంవత్సరాల వయస్సు నుండి, కచ్నర్ చౌదరి అనేక టోర్నమెంట్లలో బంగారు పతకాలు గెలుచు కుంది. ఆమె ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు , ఓపెన్ నేషనల్ గేమ్స్‌లో బంగారు , వెండి పతకాలు గెలుచుకుంది. 2016లో జరిగిన జూనియర్ నేషనల్ యూత్ నేషనల్‌లో కచ్నర్ బంగారు పతకాలు గెలుచుకుంది.2018లో గౌహతిలో జరిగిన జాతీయ అం తర్-రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలు చుకుంది. ఆమె 2019లో దక్షిణాసియా క్రీడలలో కాంస్య పతకా న్ని, 32వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో బంగా రు పతకాన్ని గెలుచుకుంది.

# స్మరాన్ రవిచంద్రన్ పై కన్నేసిన కావ్యా మారన్



మహారాజా టీ20 లీగ్‌లో 22 ఏళ్ల స్మరాన్ రవిచంద్రన్ బ్యాటింగ్ చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఆగస్టు 23న జరిగిన మ్యాచ్‌లో, స్మరాన్ రవిచంద్రన్ ప్రస్తుత మహారాజా టీ20 లీగ్ సీజన్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో అతను 52 బంతుల్లో బీభత్సం సృష్టించాడు. దీంతో జట్టు గెలవడమే కాకుండా లీగ్‌లో 4 రికార్డులు కూడా ప్రస్తుతానికి అతని పేరు మీద ఉన్నాయి. ఆగస్టు 23న మహారాజా టీ20 లీగ్ 2025లో గుల్బర్గా మిస్టిక్స్ వర్సెస్ బెంగళూరు బ్లాస్టర్స్ మధ్య ఒక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో, బెంగళూరు బ్లాస్టర్స్ ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులు చేసింది. ఇప్పుడు గుల్బర్గా మిస్టిక్స్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యాన్ని 4 బంతుల ముందుగానే 4 వికెట్లు కోల్పోయి సాధించింది. అంటే, గుల్బర్గా మిస్టిక్స్ ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ మ్యాచ్‌లో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే స్మరాన్ రవిచంద్రన్ విధ్వంసక బ్యాటింగ్. ఈ సీజన్‌లో 22 ఏళ్ల స్మరాన్ చేసిన అతిపెద్ద ఇన్నింగ్స్. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే అతను ఔట్ కాలేదు. అంటే, అతను క్రీజులోకి అడుగుపెడితే, మ్యాచ్ గెలిచిన తర్వాతే తిరిగి పెవిలియన్ చేరాడు. స్మరాన్ రవిచంద్రన్ 52 బంతులు ఎదుర్కొని అజేయంగా 89 పరుగులు చేశాడు. 171 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడిన అతని ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. స్మరాన్ ఈ బ్యాటింగ్ కారణంగా, అతని జట్టు గుల్బర్గా మిస్టిక్స్ బెంగళూరు బ్లాస్టర్స్‌పై గెలవడమే కాకుండా, తన పేరు మీద 4 రికార్డులు కూడా సృష్టించాడు. 52 బంతుల్లో 89 పరుగులు చేసిన తర్వాత, స్మరాన్ రవిచంద్రన్ మహారాజా టీ20 లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 8 ఇన్నింగ్స్‌లలో అతను 391 పరుగులు చేశాడు. అదే సమయంలో సిక్సర్లు కొట్టే విషయంలో అతనికి దగ్గరగా ఎవరూ లేరు. అతను ఇప్పటివరకు 25 సిక్సర్లు కొట్టాడు. ప్రస్తుత మహారాజా టీ20 లీగ్ సీజన్‌లో 20 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు కొట్టిన ఏకైక బ్యాట్స్‌మన్ అతనే. దీంతో పాటు, అతని బ్యాటింగ్ సగటు 97.75 కూడా ప్రస్తుత మహారాజా టీ20 లీగ్ సీజన్‌లో అత్యధికం. ఇప్పటివరకు అత్యధికంగా ఐదుసార్లు యాభైకి పైగా స్కోర్లు చేసిన బ్యాట్స్‌మన్‌గా స్మరాన్ రవిచంద్రన్ నిలిచాడు.22 ఏళ్ల స్మరాన్ రవిచంద్రన్‌పైనే కావ్య మారన్ కూడా పందెం వేసింది. కావ్య మారన్ ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ప్రత్యామ్నాయ ఆటగాడిగా అతనిని అనుసంధానించింది.



# జీ స్టూడియోకు చిరు చిత్రం డిజిటల్ రైట్స్




అనిల్ రావిపూడి చివరిగా చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏకంగా 300 కోట్లు- కలెక్ట్ చేసి, ఫ్యామిలీ సినిమా సత్తా ఏంటో చాటింది. నామ్ థియేటర్ హక్కులను జీ స్టూడియోస్ సంస్థ భారీగానే దక్కించుకొని, గట్టిగానే లాభపడింది. ఇక ఇప్పుడు చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమా విషయంలో కూడా హక్కులు జీ స్టూడియోస్ దక్కించుకున్నట్టు- తెలుస్తోంది. ఈ సినిమాకు మన శంకర వరప్రసాద్ గారు పండగకి వస్తున్నారు అనే టైటిల్‌ను అనిల్ రావిపూడి ఫిక్స్ చేశాడు. జీ స్టూడియోస్ సంస్థ డిజిటల్ రైట్స్‌తో పాటు- శాటిలైట్ రైట్స్‌ను కూడా ఫ్యాన్సీ ప్రైస్‌కి దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు- సమాచారం. దాదాపుగా డీల్ క్లోజ్ అయినట్లేనని, చిరంజీవి-అనిల్ రావిపూడి కెరీర్‌లోనే అత్యధిక డబ్బులు రాబట్టిన ఓటీటీ- డీల్‌గా ఇది నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, జీ స్టూడియోస్ సంస్థ ఈ సినిమాకు సంబంధించిన హిందీ డిజిటల్ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్‌కు అమ్మేసింది. అయితే, సౌత్ శాటిలైట్, డిజిటల్ రైట్స్‌ను మాత్రం తన దగ్గరే ఉంచుకుంది. నిజానికి, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సంస్థలు ఈ సినిమా రైట్స్ దక్కించుకునే ప్రయత్నం చేశాయి. అయితే, అనిల్ రావిపూడితో ప్రస్తుతం షోస్ కూడా చేస్తున్న జీ స్టూడియోస్ సంస్థ ఫైనల్‌గా డీల్ క్రాక్ చేసింది. ఇప్పటికే ఇండస్ట్రీ సమ్మె పూర్తికావడంతో, సెప్టెంబర్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి బరిలోకి దించబోతున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు బీమ్స్ సంగీతం అందిస్తున్నాడు.

# వెంకటేశ్‌తో వివి వినాయక్ మరో సినిమా?





టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, తన తదుపరి సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చిన విజయాన్ని కొనసాగించాలని భావిస్తున్న వెంకీ, ఎంతో ఆలోచించి తన తదుపరి ప్రాజెక్ట్‌ను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేస్తున్నాడు. వెంకటేష్ - త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ చేస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.
ఇకపోతే త్రివిక్రమ్ సినిమా మాత్రమే కాకుండా, వెంకటేష్ ప్రస్తుతం ఇతర దర్శకులతో కూడా చర్చలు జరుపుతున్నారు. కొత్త కథలు వింటూ, తదుపరి ప్రాజెక్టుల కోసం పునరాలోచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. గతంలో వెంకటేష్‌తో 'లక్ష్మి' అనే బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన వి.వి. వినాయక్, మళ్లీ వెంకీ కోసం ఓ మాస్ ఎంటర్‌టైనర్ స్క్రిప్ట్ రాయిస్తున్నట్లు- సమాచారం. త్వరలోనే ఆయన వెంకటేష్‌ను కలవాలని, కథ చెప్పాలని చూస్తున్నట్లు- ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. 2006లో వచ్చిన 'లక్ష్మి' చిత్రం వెంకటేష్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. అప్పట్లో వీరిద్దరి కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందని వార్తలు వచ్చినా, ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. ఇప్పుడు 19 ఏళ్ల గ్యాప్ తర్వాత, మళ్లీ అదే కాంబినేషన్ తెరపైకి వస్తుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. పైగా ఇది కూడా మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఉండనున్నట్టు- సమాచారం. 'ఇంటెలిజెంట్' వంటి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన తర్వాత వినాయక్ కొంతకాలం గ్యాప్ తీసుకున్నారు. హిందీలో 'ఛత్రపతి' రీమేక్ చేసినా, అది కూడా మిశ్రమ స్పందనే పొందింది. దాంతో కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వెంకటేష్‌తో కాంబినేషన్ కుదిరితే, వినాయక్ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# మిరాయ్ సినిమా మరో వారం వాయిదా




హనుమాన్ సినిమాతో ఫ్యాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకున్న తేజా, ఇప్పుడు మిరాయ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజానికి, ఈ సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది, కానీ ఈ సినిమా ఒక వారం వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు. ఇంకా అధికారిక సమాచారం రాలేదు, కానీ సెప్టెంబర్ 12వ తేదీన సినిమా రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని 28వ తేదీన రిలీజ్ చేయబోతున్న ట్రైలర్‌తో పాటు- ప్రకటించనున్నారు. ఈ సినిమా పూర్తిగా కంప్యూటర్ గ్రాఫిక్స్ బేస్డ్ సినిమా. సినిమాలో సింహభాగం కంప్యూటర్ గ్రాఫిక్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ సినిమా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సెప్టెంబర్ 1వ తేదీ నాటికి రెడీ అవుతుందని అంచనా వేసినప్పటికీ, ఒకవేళ వాటిలో ఏమైనా కరెక్షన్స్ చేయాల్సి వస్తే, అప్పటికప్పుడు చేసి 5వ తేదీ లోపు రిలీజ్ చేయడం కష్టం కాబట్టి, కాస్త సమయం తీసుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీన ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.

# యధావిధిగా 5న విడుదలవుతున్న ఘాటి




క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క, విక్రమ్ ప్రభు కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ డ్రామా 'ఘాటీ-'. సెప్టెంబరు 5న ఈ మూవీ విడుదల కానుంది. ఇదే రోజున రావాల్సిన 'మిరాయ్' వాయిదా పడటం అనుష్క సినిమాకు కలిసొచ్చే అంశం. ఎక్కువ థియేటర్లు దొరికే అవకాశం ఉంది. అదే సమయంలో తమిళం నుంచి వస్తున్న శివకార్తికేయన్ 'మదరాశి' పైనా మంచి అంచనాలే ఉన్నాయి. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రస్తుతం ఈ సినిమాలకే కాదు, దసరా కానుకగా రాబోతున్న చిత్రాల పైనా సమ్మె ప్రభావం పడినట్లు- తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడి సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీని సెప్టెంబరు 25న విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీ-వల ఈ సినిమా విడుదల తేదీ విషయంలో కాస్త గందరగోళం నెలకొంది. ఇంకో నాలుగైదు రోజుల షూటింగ్, అది కూడా ప్యాచ్ వర్క్ మిగిలిఉందని టాక్ వినిపించింది. ఈక్రమంలో సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందన్నారు. కానీ, 'సువ్వి.. సువ్వి' సాంగ్ ప్రకటిస్తూ విడుదల తేదీలో ఎలాంటి మార్పు లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇంకా నెల రోజులే సమయం ఉండటంతో వీలైనంత త్వరగా ప్రమోషన్స్ మొదలు పెట్టాలని పవన్ అభిమానులు కోరుతున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 'అఖండ2: తాండవం' కూడా సెప్టెంబరు 25నే విడుదల కావాల్సిఉంది. ఈ విషయాన్ని కూడా చిత్ర బృందం ప్రకటించింది. ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితుల వల్ల విడుదల తేదీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దసరా సీజన్ తప్పితే, 'అఖండ' వచ్చిన డిసెంబరులోనే 'అఖండ2' కూడా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బాలకృష్ణ డబ్బింగ్ కూడా పూర్తి చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉందని టాక్.



# పరమ్ సుందరి... విమర్శలకు జాన్వీ చెక్

సిద్దార్థ్ మల్హోత్రా-జాన్వీ కపూర్ జంటగా తుషార్ జలోటా దర్శకత్వంలో 'పరమ్ సుందరి' చిత్రం అన్ని పనులు పూర్తి చేసుకుని రిలీజ్ కు రెడీ అవుతోంది. మరికొన్ని గంటల్లోనే చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో జాన్వీ కపూర్ మలయాళి యవతి పాత్రలో మెప్పించబోతుంది. దీక్షా పట్టా సుందరై దామోదరం పిళ్లై పాత్రలో జాన్వీ కనిపించనుంది. అయితే జాన్వీ కపూర్ ఇలా మలయాళ యువతి పాత్రలో నటించడంపై విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఓ హిందీ నటి మాప్రాంతానికి చెందిన అమ్మాయి పాత్రలో నటించడం ఏంటని మాలీవుడ్ నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుంది. శ్రీదేవి కుమార్తె కావడంతోనేనా: దీనిలో భాగంగా కొంతమంది మాలీవుడ్ నటీమణులు జాన్విని విమర్శించారు. ఆ పాత్రలో నటించే అవకాశం తుషార్ తమకు ఇవ్వకుండా హిందీ యువతికి ఇవ్వడం ఏంటని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. జాన్వీకంటే గొప్పగా తాము నటించగలమని..ఆ పాత్ర తమతోనే సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేసారు. జాన్వీ లాంటి పెద్ద కుటుంబం నుంచి వచ్చిన నటీమణులు వల్ల తమ లాంటి వారికి అవకాశం రావడం లేదని ఆవేదన చెందారు. మొత్తంగా ఈ సినారే లో జాన్వీ ఎక్కువగా హైలైట్ అయింది. తాజాగా ఈ విమర్శలకు జాన్వీ తెలివిగా ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేసింది. పరమ్ సుందరి తాను కేవలం కేరళ యువతి పాత్రలో మాత్రమే కాకుండా తమిళ యువతిగాను కనిపిస్తానంది. తన మూలాలు కేరళలో లేవని...తనది కానీ, తన తల్లి శ్రీదేవి గాను మలయాళీలు కాదంది. కానీ అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు తానుప్పుడూ గౌరవిస్తానని...అక్కడ వాతావరణం....క్రమశిక్షణ ఎంతో గొప్పగా ఉంటుందన్నారు. ఆ ప్రాంతానికి చెందిన అమ్మాయి పాత్రలో తాను నటించడం ఓ అదృష్టంగా పెర్కొంది. పరమ్ సుందరికి ప్రీ పబ్లిసిటీ: 'ఓనం' పండుగ ప్రత్యేకత గురించి చెప్పుకొచ్చింది. అవకాశం వస్తే అక్కడ పరిశ్రమలోనూ సినిమాలు చేస్తానంది.

# గాయని కెన్నీషాతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న జయం రవి..

## 'దేవుడిని మోసం చేయలేరు' అంటూ భార్య పోస్ట్!



కోలీవుడ్ నటుడు జయం రవి, ఆయన భార్య ఆర్తి మధ్య జరుగుతున్న విడాకుల వివాదం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఇటీవల జయం రవి తన స్నేహితురాలు, గాయని కెన్నీషాతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ విషయంపై ఆయన భార్య ఆర్తి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఆమె పెట్టిన పోస్ట్ ఇప్పుడు కోలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విడాకుల కేసు కోర్టులో నడుస్తుండగానే జయం రవి, కెన్నీషా కలిసి బహిరంగంగా కనిపించడం ఇది మొదటిసారి కాదు. గతంలో పలు ఈవెంట్లు, వివాహ వేడుకలకు జంటగా హాజరయ్యారు. అయితే ఈసారి ఏకంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లడంతో వారిద్దరి ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ పరిణామంపై స్పందించిన ఆర్తి, తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు.